# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగష్టు 2025

వెల : రూ. 10.00



మే 31 నాడు శ్రీశైల ఆశ్రమ శాఖ శీఘ్ర ప్రారంభ సిద్ధ్యర్థం,
ఆశ్రమ స్థలమునందు శ్రీమాతాజీ వారు నిర్వహించిన హోమ దృశ్యాలు










మే 30 నాడు వేసవి
శిక్షణాతరగతులలో
పాల్గొన్న బాలబాలికలతో
శ్రీ మాతాజీ.

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 44 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar,Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** .......... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .......... 4
శ్రీబాబూజీ ఉవాచ.......... 5
అమ్మమాట.......... 7
కనులకు వెలుగు నీవే కావా! .......... 9
బాలకృష్ణుడు - బాబు.......... 11
మనస్సు .......... 13
దత్తాత్రేయుడు.......... 15
భగవద్గీత సాధన దీపిక .......... 17
భూత దయాం విస్తారయ.......... 19
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ...... 21
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 23
నారద భక్తి సూత్రములు .......... 25
సాధన .......... 27
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....28
ఖాళీ పాత్ర.......... 29
నిరీక్షణ .......... 32
ప్రహేళిక .......... 34
శ్రీ గురుగీత .......... 36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు .......... 40

# శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

3. ***నాయిల్లు నాయాస్తి నాభార్యయందువు***
***నా పిల్లలో యంచు మురిసిపోదువు***
***నాది నాదన్న వాడు బంధాల పాలౌను***
***కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥***



తా: మానవుడు ఇది నా ఇల్లు, నా ఆస్తి, నా భార్య, పిల్లలు అంటూ మురిసిపోతాడు, లేదా తనవి అనుకున్నవి తనకు అనుకూలంగా, తాను అనుకున్నట్లుగా లేవని క్రుంగిపోతాడు. ఎప్పటివరకు ఈ నాది నాది అనే భావన పోదో అప్పటివరకు బంధాలు తప్పవు. నేను, నాది అనే భావనలు పోయినప్పుడు ఇక సృష్టిలో వున్నదంతా నువ్వే, నీదే. అదే మోక్షం.

**1**. ఎంతో కష్టమనుకున్న నేత్రచికిత్స అతి తేలికగా ఎలా అయ్యింది?
**2**. కురుక్షేత్రంలో పొందిన విషాదాన్ని 30 ఏళ్ల తరువాత అర్జునుడు మళ్ళీ ఎందుకు పొందాడు?
**3**. శ్రీమహావిష్ణువు చేతిలో మరణించిన మొసలి పూర్వజన్మలో ఎవరు?
**4**. గురువుగారికి తమలపాకులపై వ్యామోహం ఎందుకు కలిగింది?
**5**. గురుదేవులను ఆశ్రయించి, వరాలు పొంది ధర్మ సంస్థాపన చేసిన రాజు కూడా చివరికి దేని ప్రభావానికి లొంగి మరణించాడు?
**6**. సుతిమెత్తని కమలాలు తాపాన్ని హరించి, సాగరాన్ని తరింప జేయడం ఎలా సాధ్యం?
**7**. భగవంతుని అనుగ్రహం పొందడానికి మార్గమేది?
**8**. నిజమైన బ్రహ్మచారి నిరంతరం ఏ భావనతో ఉంటాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో..........................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

25-6-1981

ఈరోజు సాయంత్రం గుంటూరులో సత్సంగ సమావేశము వుంది. శ్రీ బాబూజీ తమను ఆహ్వానించడానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ 'నాకు సోమయ్యగారంటే చాల ఇష్టము. ఎందుచేతనంటే ఆయన బ్రహ్మచర్యం అవలంబించేవారు. నా శిష్యకోటిలో అలాంటివాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి వారింట్లోనే నేను వుంటాను. బ్రహ్మచర్యమంటే ఏమని అనుకుంటున్నారు?



నూరుమంది సంతానము కలిగిన వసిష్ఠులవారు బ్రహ్మచారే! బ్రహ్మచర్యమంటే భార్యాపిల్లల్ని త్యజించి ఏ కోర్కె లేకుండా ఉండాలని కాదు. తనకి కోరిక కలిగితే భార్యతో తీర్చుకోవచ్చు కాని పరస్త్రీని మాతృభావంతో చూడాలి. పరస్త్రీని చూసినపుడు ఏ రకమైన వికార భావం కలగకూడదు. కనీసం ఈమె అందంగా ఉంది అన్న భావం కూడా పనికిరాదు. అటువంటివాడే బ్రహ్మచారి. మనస్సును బ్రహ్మమునందే నిలిపిన భక్తునికి అటువంటి భావాలు ఎందుకు కల్గుతాయి? అటువంటి భక్తుని ఇంట్లోనే ఉంటాను. భక్తిలేని వారింట్లో అడుగుపెట్టను' అన్నారు.

శ్రీబాబూజీ ఇంకా మాట్లాడుతూ 'మనస్సు అనేక వాసనలతో ఉంటుంది. ఉదాహరణకి ఈయన చూడండి. ఇదివరలో కారాకిళ్ళీ వేసేవారు. అది ఎప్పుడూ బుగ్గనే ఉండేది. అప్పుడు అదే చాలా ఆనందాన్నిచ్చేది ఆయనకు. ఒక్కొక్కసారి ఆ కిళ్ళీని అలా బుగ్గన పెట్టుకునే నిదురించేవాడు. అది మానేసి రెండు సంవత్సరాలైంది. అయినా ఆయన పళ్ళు చూడండి ఇంకా వాటిని పట్టిన గార వదల్లేదు కదా! మరి జన్మ జన్మలనుంచి ఆర్జించిన వాసనలు వదులుతాయా?' అన్నారు.

ఇంతలో డాక్టరుగారు మాట్లాడుతూ 'సాయంత్రం సత్సంగ సమావేశానికి ముందు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్తామండీ' అన్నారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'ఎందుకండీ అవన్నీ. నా సంగతి మీకందరికి తెలుసుకదా! ఎడ్వర్‌టైజ్‌మెంట్ అంటే గిట్టదు కదా! సరే మిమ్మల్ని కాదనటం ఎందుకు? మీరు ఏర్పాట్లు చేసుకున్నారు కాబట్టి ఎలా నిర్ణయింపబడి ఉంటే అలా జరుగుతుంది. అమ్మ ఎలా జరగాలని నిర్ణయించి ఉంటే అలా జరుగుతుంది మీరు మాత్రం బాధపడకండి' అన్నారు.

గుంటూరులో సాయంత్రం సత్సంగ సమావేశానికి ఏర్పాట్లు జరిగాయి. సంకీర్తన ప్రారంభించారు. శ్రీ బాబూజీ కోసం అంతా నిరీక్షిస్తున్నారు. వర్షం మొదలైంది. హోరున వర్షం పడుతోంది. శ్రీ బాబూజీ వచ్చారు. ఊరేగింపు కార్యక్రమానికి వీలులేకపోయింది. అలాగే వర్షంలోనే భక్తులంతా కూర్చుని ఉన్నారు. స్వామి ఉపన్యాసం కోసం ఎంతో ఆతృతతో వేచియున్నారు. సత్సంగ సమావేశము అంతటితో ముగిసింది. ఆదివారంనాటికి వాయిదా పడింది.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'మీ అందరి మనస్సుల్లో ఉన్న తీవ్ర ఆవేదనని భగవానుడు ఎన్నడూ విస్మరించడు. తప్పక మీరంతా ఆదివారం ఆనందిస్తారు' అన్నారు.

**పూజ్యశ్రీ మాతాజీ వారి సత్సంగ సమావేశములు**

**1). 29-8-25 నుండి 31-8-25 వరకు కట్టమూరు గ్రామంలో మహంకాళమ్మ గుడి వద్ద సత్సంగ సమావేశములు.**
**వివరములకు: వెంకటరావు - 99597 60387.**

**2) 3-9-25 నుండి 7-9-25 వరకు హైదరాబాద్ శాఖలో సత్సంగ సమావేశములు**
**వివరములకు: మనోహర్ - 99483 97063.**

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ఆసక్తి వుంటే అన్నీ సాధ్యమే

"ఆధ్యాత్మిక సాధకులయిన వారికి 'ఆసక్తి' అనేది అత్యంత అవసరం. మామూలుగా ఒక క్రికెట్ క్రీడలోనో, లేక ఏ యితర క్రీడలు, చదువులలోనో విజయం సాధించడానికి, ఆసక్తి, దానికి తగిన కృషి, ఏకాగ్ర చిత్తము ఎంత అవసరమో, అధ్యాత్మికోన్నతిని సాధించాలంటే, సాధకుడికి కూడా వాటి అవసరం యింకా అనేకరెట్లు అధికంగా వుంటుంది. మనం మహాత్ముల నోట వచ్చిన ప్రతిమాటా, గ్రంధాలలో చదివిన అన్ని విషయాలు గుర్తుంచుకోవడమనేది చాలా కష్టతరమైన పని. కానీ, ఆసక్తి కలిగిన వారికి అది సుసాధ్యమవుతుంది.



సద్గురుమహరాజ్ మనని ప్రపంచాన్ని వదిలేసి, ముక్కు మూసుకుని సాధన చేయమనలేదు. ప్రపంచలోనే వుంటూ, ప్రపంచ స్వరూపమైన మనం, పరమాత్మ స్వరూపమైన గురుదేవునితో ఐక్యమయి, పరమాత్మ స్వరూపం చెందడానికి, ఆసక్తి, క్రమశిక్షణతో కూడిన సాధన చేయాలి. గురుమహరాజ్ ప్రపంచంలోనే వున్న మనకి, ప్రపంచంలోని విషయాలనే ఉదహరిస్తూ, దానిలో తత్వం జోడించి చెప్పారు. దానిని ఆసక్తి కలవారు చక్కగా గ్రహించి, ఆచరించితే ఆనందం పొందగలరు. దీనికే, నిజమైన శిష్యుని యొక్క 'ఆసక్తి' ఏ విధంగా వుంటుందీ అన్న విషయం శ్రీ సమర్థ రామదాసస్వామి శిష్యుడైన కల్యాణ్ చరిత్ర వల్ల మనకు తెలుస్తోంది.

శ్రీ సమర్థుల శిష్యులలో, కల్యాణ్ అనే బాలుడు గురుభక్తిలో అగ్రస్థానాన్ని అలంకరించినవాడు. ఆ గురుభక్తాగ్రేసరుడికి గురుసేవ మినహా తదితర ఆలోచనలే లేవు. అటువంటి శిష్యుని చూచి, ఏ గురువు గర్వించరు? అది చూచి, సమర్థులవారికి కల్యాణ్ అంటే ఎక్కువ యిష్టం, అనే ఈర్ష్యాభావానికి లోనైన యితర శిష్యులు, కల్యాణ్‌ను ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తూండేవారు. సత్య గురువులకి ఒకరంటే

యిష్టము, మరొకరంటే అయిష్టమూ వుంటాయా? సర్వాంతర్యాములైన సమర్థులు, ఈర్ష్యాగ్రస్థులైన శిష్యులకి బుద్ధిచెప్పడం కోసం, ఒక లీలా నాటకం నడిపించారు.

ఒకనాటి అర్ధరాత్రి సమర్థులు లేచి, ఒక్క కల్యాణ్‌ని తప్ప, నిద్రపోతున్న మిగతా శిష్యులనందరినీ లేపి, తమకు అత్యవసరంగా తమలపాకులు కావాలనీ, తాంబూలం వేసుకోకపోతే తమకు నిద్రపట్టేటట్టు లేదని, కనుక వెంటనే తమలపాకులను తీసుకుని రావలసిందిగా ఆజ్ఞాపిస్తారు. ఆ శిష్యులందరూ ముఖాముఖాలు చూసుకుని మఠం అంతా వెదికినా ఒక్క ఆకు కూడా కనిపించదు! అంతకు ముందే సమర్థులు వాటిని దాచి వుంచారన్న విషయం వీళ్ళకేమి తెలుసు! వారు వెదుకుతూనే వున్నారు. నిమిష నిమిషానికీ సమర్థులు, శిష్యులని తొందర చేస్తున్నారు.

ఆ శిష్యులు, 'ఇదేమిటి! ఇంతటి గురువుగారికి యీ తమలపాకుల వ్యామోహం ఏమిటీ!' అని గుసగుసలాడుకుంటూ, 'సరే, కల్యాణ్‌ని లేపుదాం, వాడేం చేస్తాడో చూద్దామని, కల్యాణ్‌ని లేపి, విషయం చెప్పేసరికి, కల్యాణ్ చయ్యన లేచి, ఛడావులు కాళ్ళకి తొడుగుకొని, ఆ అమావాస్య చీకటిలో, అడవిలోనికి తమలపాకులకై దూసుకుంటూ పోతాడు. తమలపాకులు కోస్తూ వుండగా, ఒక విషనాగు కాటుకి గురై కల్యాణ్ అక్కడే పడిపోతాడు.


సమర్థులు కల్యాణ్ ఎంత సేపటికి రాకపోయేసరికి, తీవ్ర ఆవేదనతో, అడవిలోనికి వెళ్ళి, కల్యాణ్ స్థితిని చూచి, ఎంతో దుఃఖించి, 'భైరవ స్వామిని' ప్రార్థించి, తమ కల్యాణ్‌ని బ్రతికించమని కోరేసరికి, భైరవుడు వారి ఆజ్ఞను శిరసా వహించి కల్యాణ్‌లోని పాము విషాన్ని అంతా పీల్చివేసి, పునర్జీవితుడుగా చేస్తాడు. సమర్థులు ఆనందంతో ఉప్పొంగిపోయి, 'భైరవా! నీకు పదకొండు మణుగులు బెల్లం నైవేద్యం పెట్టి, ఊరంతా పంచిపెడతానయ్యా!' అని కల్యాణ్‌ని తమ గాఢ పరిష్వంగ్వంలో బంధించుతారు. చూశారా! నిజమైన శిష్యుని ఆసక్తి, అట్టి శిష్యునిపై గురుమూర్తికి వుండే అపార ప్రేమానురాగాలకీ, యీ జరిగిన సంఘటన అద్దం పడుతోంది! అటువంటి శ్రద్ధాసక్తులు కలిగి వుండి, గురుదేవుల అపార కరుణకు పాత్రులగుదురు గాక!

# కనులకు వెలుగు నీవే కావా!

సేకరణ -కీ.శే. జానకి రామశాస్త్రి

అది 1996వ సంవత్సరము ఏప్రియల్ నెల. యధావిధిగా వేకువనే నిద్రలేచి, కళ్ళు తెరిచేసరికి, నా ఎడమకన్ను దృష్టి మసకబారి, వాతావరణమంతా అస్పష్టంగా గోచరించింది. ఈ హఠాత్ పరిణామానికి ఎంతో ఆందోళన చెందిన నేను "నా ఆరాధ్య దైవమైన ఆ తిరుమలేశునికి నా బాధ విన్నవించుకున్నాను.

గతంలో ఆ స్వామి కరుణాకటాక్షాలతో, అనేక ఆపదలు, సమస్యలనుండి సునాయాసంగా బయటపడ్డ నేను, ఈసారి కూడా ఆస్వామిపై పూర్తి భారం మోపి, నాకు పరిపూర్ణదృష్టిని ప్రసాదించమని అంతులేని ఆవేదనతో, ఆర్తితో అర్థించాను.



రోజురోజుకు క్షీణిస్తున్న నా ఎడమకంటి దృష్టి పాక్షిక అంధత్వానికి దారి తీస్తుంటే, మానసికంగా క్రుంగిపోయిన నేను చివరకు ఆ "ఆపద మ్రొక్కుల వాని" నామలిఖిత జపం ప్రారంభించాను. ప్రతిరోజు ఎంతో భక్తి శ్రద్ధలతో "ఓం నమః శ్రీ వేంకటేశాయ" అనే నామాన్ని ఒక పెద్ద పుస్తకంలో రోజు ఒక పేజి వ్రాయసాగాను. పుస్తకం పూర్తయ్యే లోపల నా సమస్యను పరిష్కరించాల్సిందిగా ఎంతో ఆర్ద్రతతో ఆ స్వామిని రోజూ ప్రార్థించేవాడిని.

మానవ ప్రయత్నంగా నాకంటి సమస్యను, నేత్రవైద్యుడి దగ్గరకు వెళ్ళి పరీక్షలు చేయించాను. అతి ఖరీదైన "కార్నియా మార్పిడి" శస్త్ర చికిత్స చేస్తే తప్ప పూర్వపు దృష్టి వచ్చే అవకాశంలేదని వైద్యులు తేల్చి చెప్పారు. అదికూడా మహానగరాల్లోని ప్రఖ్యాతి గణించిన నేత్రవైద్య శాలలో మాత్రమే సాధ్యమని చెప్పారు. ఆ కొండలరాయడిపై అపార విశ్వాసం, భక్తి ఉన్న నేను ఏ మాత్రం చలించక నిర్విఘ్నంగా ఆ స్వామి "లిఖిత జపం" లో మునిగి పోయాను.

ఇది ఇలా ఉండగా ఏప్రియల్ 24వ తేది నుండి ప్రారంభమైన వేసవి సెలవులలో కుటుంబ సమేతంగా ముంబై వెళ్ళి, అక్కడ మా బంధువుల ఇంట్లో కూడా "లిఖితజపం" కొనసాగించాను.

ఎడమకంటి దృష్టి దాదాపు పూర్తి క్షీణదశకు వచ్చింది. నా "లిఖితజపం" పుస్తకం ఇక రెండు రోజులలో పూర్తవుతుందనుకునే సందర్భంలో ముంబైలోని అతి ఖరీదైన "జస్లోక్ హాస్పిటల్"లో ప్రముఖ వైద్యునిగా పనిచేస్తున్న నా పూర్వ విద్యార్థి నాకు తటస్థపడి, నన్ను గుర్తుపట్టి ఎంతో ఆప్యాయత, అభిమానంతో, తన కారులో ఆసుపత్రికి తీసుకెళ్ళి హాస్పిటల్ అంతా చూపించాడు.

ఆ సందర్భంలో నేను నా కంటి సమస్యను అతనితో చెప్పగా, ఎంతో ఖరీదైన కంటి పరీక్షలు ఉచితంగా చేయించి, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాకు "కార్నియా మార్పిడి శస్త్ర చికిత్స" అవసరం లేదని, కేవలం చుక్కల మందులతో, పూర్వపు పరిపూర్ణ దృష్టి వస్తుందని హామీ ఇచ్చి, కంటి మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఆ మందులు ఆ రోజు రాత్రి నుండే వేసుకోవడం ప్రారంభించాను.

ఆశ్చర్యం! మరుసటిరోజు తెల్లవారుజామున కళ్ళు తెరచేసరికి నా ఎడమ కన్ను దృష్టిలో ఎంతో మార్పు గోచరించింది. తరువాత ఒక వారానికంతా నాకు పరిపూర్ణ దృష్టి వచ్చింది.

ఆ స్వామి కృపతో ఈ రోజు నేను చక్కని దృష్టితో ఆ స్వామి శృంగార రూపాన్ని చూడగలుగుతున్నాను. తనను నమ్ముకున్న భక్తులకు కొండంత అండ ఆస్వామి అనేందుకు ఇంతకన్నా నిదర్శనము ఏముంది.
(ఇది ఒక అజ్ఞాత భక్తుని అనుభవం)

**భీమవరం శాఖలో కార్యక్రమాలు**

1. ది.18.07.2025 శుక్రవారం నుండి 14.08.2025 గురువారం వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారిచే శ్రీమద్భాగవత ప్రవచనం – కృష్ణ తత్త్వం. ప్రతిరోజు సాయంత్రం 6.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు.
2. ది.25.07.2025 శుక్రవారం నుండి 23.08.2025 శనివారం వరకు శ్రావణ మాసం సందర్భముగా ప్రతిరోజు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు. ఆసక్తి కల భక్తులందరూ పాల్గొన వచ్చును.

# బాల కృష్ణుడు - బాబు

(గత సంచిక తరువాయి)

- పాలూరి కాళీప్రసాద్

శ్రీబాబు భీమవరం తాతయ్య (శ్రీ పాలూరి శ్రీరామమూర్తి)గారి ఇంటిలో ఉన్న రోజుల్లో శ్రీ చల్లా కృష్ణమూర్తిగారి కుటుంబం వారి ఎదురింటిలోనే ఉండేవారు. శ్రీకృష్ణుడు ఎలాగైతే అత్తాకోడళ్ళ మూతులకి వెన్నలు పూయడం, నిద్రిస్తున్న తాతల పిలకలను దూడల తోకలకు కట్టి పరిగెత్తించడం వంటి చిలిపి లీలలు చేసేవాడో శ్రీబాబు కూడా వారి కుటుంబాలతో అలాంటి లీలలే చేసేవారు. తాము ఎంతటి మహాత్ములయినా ఆ కుటుంబంలోని సాధారణ వ్యక్తి వలెనే అందరితో కలిసిపోయేవారు. బాలకృష్ణుడు తన నోటిలో బ్రహ్మాండాన్ని అంతటినీ యశోదకు చూపించినట్లుగానే శ్రీబాబు 'అమ్మా' అని పిలిచే పాలూరి సీతమ్మగారికి, శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారికి దివ్య దర్శనాన్ని అనుగ్రహించారు.

ఒకరోజు శ్రీబాబు దేవతార్చన చేసుకుంటున్న సమయంలో గుమ్మం వద్ద కూర్చున్న సీతమ్మగారికి భూమి నుండి ఆకాశం వరకు వ్యాప్తమైన తెల్లని కాంతిపుంజం కనిపించి, అందులో వటపత్రశాయి అయిన బాలకృష్ణుడు, శ్రీబాబు మార్చి మార్చి కనిపించారు. అంతలోనే ఆ దృశ్యం మాయమై ప్రపంచము, పట్టణాలు, మేడలు, బజార్లు, రంగులరాట్నాలు, కొట్లు, ఇళ్ళు, తీర్థాలు, సముద్రాలు, పర్వతాలు కనిపించాయి. బాలకృష్ణుని సంకల్పంతోనే ప్రపంచమంతా పుట్టిందని, శ్రీబాబే బాలకృష్ణుడని ఆమెకు దివ్య స్ఫురణ కలిగింది.

అలాగే ఒకసారి కోటప్పకొండలో శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారికి శ్రీబాబు స్థానంలో తెల్లని వెలుగు గది అంతా వ్యాపించి అందులోనుండి మూడు రంగుల కాంతి పుంజాలు, వాటిలోనుండి త్రిమూర్తులు దర్శనమిచ్చి తిరిగి అంతా శ్రీబాబులోనే లీనమైపోయినట్లు దివ్య అనుభూతి కలిగింది.

శ్రీకృష్ణుడు అఘాసురుని నోటిలో పడిన, మరొకసారి దావానలంలో చిక్కుకొన్న గోపబాలురను అందరినీ రక్షించినట్లుగానే శ్రీబాబు సుడిగుండంలో చిక్కుకున్న భక్తులను అనేకసార్లు రక్షించారు. తెల్లవారుజాము అనుకొని పొరబడి అర్థరాత్రి వేళ నదిలో స్నానానికి వెళ్ళి వరుణ భటుని చేతిలో చిక్కి వరుణలోకానికి వెళ్ళిపోయిన నందుని,

సముద్రంలో తీర్థ స్నానానికి వెళ్లి పంచజన్యుని నోట చిక్కి యమపురికి చేరిన గురుపుత్రుని శ్రీకృష్ణుడు రక్షించి తిరిగి తీసుకువచ్చినట్లుగానే మరణించి వైకుంఠానికి చేరిన కుమారి ఇందిరాదేవి గారిని, శ్రీ కొప్పెర్ల వెంకటరాజు (నిండ్రకొలను డాక్టరు) గారిని శ్రీబాబు మళ్లీ పునర్జీవితులను చేశారు. అలాగే ఎందరో భక్తులకు దీర్ఘ రోగాలను నయంచేసి ఆయుష్షును పెంచారు. శ్రీకృష్ణుడు గోపాలురకు రాక్షస బాధను తొలగించినట్లుగానే ఎందరో భక్తులకు గ్రహబాధలు తొలగించారు.

మన దగ్గర ఏమున్నా పదిమందికీ పంచిపెట్టి అందరమూ కలిసి అనుభవించాలి కానీ ఒక్కరే దాచుకొని తినడం ఆ పరమాత్మకు నచ్చదు. అందుకే బాలకృష్ణునితో పాటు దూడలను కాయడానికి వెళ్లిన గోపబాలురు అందరూ స్వామితో కలిసి కూర్చొని వారు వారు తెచ్చుకొన్న పదార్థాలు అందరితో సమానంగా పంచుకొని ఆరగించవలసిందే. గోపికలు పంచిపెట్టకుండా అమ్ముకోవడానికై ఉట్టి మీద దాచిన పెరుగు వెన్నలు బాలకృష్ణుడు దొంగిలించి పిల్లలందరికీ పంచిపెట్టేవాడు. అలాగే శ్రీబాబు కూడా ఆయా గ్రామాలలో వ్యాహ్యాళికి వెళ్లినప్పుడు, లేదా ఎవరి ఇంటికైనా అతిథులుగా వెళ్లినప్పుడు ఇంటివారు లోపల లోపల దాచిన తినుబండారాలన్నీ చెప్పి మరీ బయటకు తీయించి అందరికీ పంచిపెట్టేవారు. మునులు యజ్ఞం కోసం ఎంతో ఆర్భాటంగా అన్ని సంబారాలను సమకూర్చుకొన్నా వచ్చినవాడు యజ్ఞ పురుషుడని గ్రహించలేకపోయారు. వారి పత్నులు మాత్రం సత్యాన్ని గ్రహించి పరుగుపరుగున వచ్చి గోప బాలకులతో కూడి ఉన్న బాలకృష్ణునికి తాము వండిన పదార్థాలన్నీ సమర్పించుకుంటే ఆ స్వామి వాటిని ఎంతో ఆప్యాయంగా ఆరగించాడు. అలాగే తన భార్యలు పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధం చేసినా కుచేలుడు తెచ్చిన అటుకులను ప్రేమగా ఆరగించాడు. అలాగే శ్రీబాబు ఆర్భాటంగా సంపన్న భక్తులు సమర్పించిన ఫలహారాలను దృష్టిమాత్రంగానే స్వీకరించేవారు కానీ ఆర్తితో ఏ పేదరాలో తెచ్చిన ఇన్ని అటుకులో, బఠాణీలో, తేగలో ప్రేమతో స్వీకరించి, అందరికీ మహాప్రసాదంగా పంచిపెట్టేవారు.

- సశేషం

# మనస్సు

- పిడుగు శివశంకరి

**శ్రీ బాబూజీ బోధల నుండి గ్రహించబడినది**

1. మనస్సు చాలా విచిత్రమైనది. మనస్సు యమధర్మరాజు. మనసే మనలను కాలుని బారునికి తీసుకువెడుతుంది. మనస్సు సదా విషయాదుల మీదకే పరుగులిడుతుంది. ఇంద్రియ సుఖాలనే కోరుతూ వుంటుంది. సోమరితనాన్ని ప్రోత్సహిస్తుంది. పడుకో పడుకో దుప్పటి కప్పుకో అని ప్రబోధిస్తుంది. నిదుర లేవనీయదు. ఇటువంటి మనస్సును స్వాధీన పరచుకోవాలంటే దానిని గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థం పైనే నిలిపి వుంచాలి.

2. కాని మహాత్ముల మనస్సు సదా పరమాత్మపైనే లగ్నమై వుంటుంది. వారు భౌతిక కాయం వదిలివేసే వరకు మనస్సుకి సంబంధం లేకుండా తమ శారీరిక విధులను నిర్వహిస్తూ వుంటారు. అదే నిజమైన బ్రహ్మచర్యము.

3. మనస్సు బ్రహ్మములో లయించినప్పుడు శరీరము సంసార యాత్ర చేసి, సంతానం పొందినప్పటికీ అది బ్రహ్మచర్యమే అవుతుంది.

4. మనస్సుని జయించాలంటే గురువుని ఆశ్రయించాలి. ఆశ్రయించి నంత మాత్రం చేత మనస్సు నిలబడదు. గురుదేవుల యందు గాఢమైన విశ్వాసం వుండాలి.

5. మనస్సుని భగవానునిపై నిలిపి నిత్యకర్మలు శ్రద్ధగా చేయడం వలన భగవంతుని అనుగ్రహం పొందవచ్చు.

6. మనం నిత్య కర్మలు చేస్తూ విరామ సమయంలో భగవంతుని రూపం మనస్సులో నిలుపుకుని ధ్యానించడం వలన క్రమేపీ మనస్సు పరమాత్మ ఆధీనమై, ఆ ధ్యానమే తపస్సుగా మారుతుంది. ఇంక కావలసినది ఏమిటి? అట్టి ఆనందాన్ని చవిచూసిన మనస్సు భువిలో వున్న ఏ యితర ఆనందాన్నీ కోరదు.

7. నిత్య కర్మలో ప్రతి పనిని పరమాత్ముని కార్యంగా ఆచరించి ఫలితం ఏదైనా సంతోషంతో స్వీకరించేవాడు శాంతిని పొందగలుగుతాడు. అది రాజయోగంలోనే సాధ్యపడుతుంది.

8. శిష్యులు గురుదేవుల యందు భయభక్తులు కలగి వుండటం వలన మనస్సు ఏకాగ్రతను సాధించి మనో వికారాలన్నీ తొలగిపోతాయి. అట్టి స్థితిలో వున్న శిష్యుడు గురువును విడిచి వుండగలడా! అట్టి భక్తి ప్రపత్తులు కలిగిన శిష్యుడిని విడిచి గురువు వుండగలడా!

9. విద్యార్థియైన యోగి! సీతారామంజనేయ సంవాదములో చెప్పబడినట్లు చతుర్విధ శుశ్రూషలు చేసి తరిస్తాడు. ఈ చతుర్విధ శుశ్రూషల ద్వారా అంతఃకరణ శుద్ధి చెంది, సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారి భగవంతుని నిలయంగా మారుతుంది.

10. విషయాదులలో లేని సిగ్గు, బిడియము, భగవంతుని విషయంలో ఎందుకో? అది మనస్సుని సమాధానపరచుకోవడంపైన ఆధారపడి వుంటుంది. కాబట్టి గురుదేవుని వద్ద మనస్సుని ఎన్నడూ దాచకూడదు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, హైదరాబాద్ కాళీవనాశ్రమ శాఖ ప్రథమ కార్యదర్శి అయిన శ్రీ గాలి జగదీష్‌గారు 13-7-2025 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 81 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఆగష్టు 2025 :*** AS 8544, 8545, 9287, PK 0101

***సెప్టెంబర్ 2025 :*** AS 0103, 0104

# దత్తాత్రేయుడు

(గత సంచిక తరువాయి)

- సన్నిధానం కాళీమాత

ధర్మగ్లాని వలన దేవతలు, మనుష్యులు బాధలు పడుతున్న సమయంలోనే దత్తాత్రేయుడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఇంద్రియ నిగ్రహంతో పరమ విరాగిగా, నిస్సంగుడుగా వున్న ఆయన మహత్తు, జ్ఞానం చూసి ఆయన దర్శనం కోసం ప్రజలు విరివిగా వస్తూ వుండేవారు. తన ఏకాంతానికి భంగం కలుగుతూ వుండటం వలన, నిస్సంగుడైన అతడు, ఒక చెరువులో కూర్చున్నాడు. చెరువులో అదృశ్యంగా వున్నా, అతనిని స్తోత్రం చేస్తూ, జనం మరింత మంది రావడంతో ఆయన నేను నిస్సంగుడిని అని కదా, వీళ్ళు నన్ను పూజిస్తున్నారు. నేను సామాన్యుడి వలె, స్త్రీ లోలుడుగా కనిపిస్తే, వీళ్ళు నన్ను వదిలివేస్తారని, మహాలక్ష్మిని తలచుకున్నాడు. మహాలక్ష్మితో కలసి భ్రష్టుడిలా కనిపించాలని తలచి, ఆమెను తన ఒడిలో కూర్చోబెట్టుకుని, మద్యపానం చేయసాగాడు. ఆయన చెడిపోయారని నిశ్చయించుకుని జనం ఆయనను వదిలి వెళ్ళిపోయారు. మార్కండేయ పురాణంలోని ఘట్టమిది.

హైహయ వంశంలో కార్తవీర్యార్జునుడు, తన తండ్రి మరణించాక, రాజ్య సింహాసనాన్ని అధిష్టించక, 'పరస్పర ద్వేషం, శతృ బాధలతో వుండే ఈ రాజ్యం నాకు వద్దు. నేను తపస్సు చేసుకుని, ఆధ్యాత్మిక బుద్ధితో అభివృద్ధి చెందిన తరువాత వస్తే వస్తాను' అని చెప్పి గర్గుడు అనే మంత్రి సూచనతో, తపోయోగ బల సంపన్నుడయిన దత్తాత్రేయుడిని ఉపాసించాలని ఆయన సన్నిధికి చేరుతాడు.

దత్తాత్రేయుడు అతనిని అనేక పరీక్షలకు గురిచేస్తాడు. 'నాకు మద్యమాంసాలు తెమ్మ'నేవారు. కార్తవీర్యార్జునుడు సమర్పించేవాడు. ఒకసారి అగ్నితో కూడిన వాయువు ఆయన లోనుండి వచ్చి కార్తవీర్యుని చేతులు కాల్చివేసింది. అనేక రకాల హింసలకు గురిచేశాడు. అయినా సరే, భక్తి విడువక ఆయనను సేవించగా, అతనిని అనుగ్రహించి వరం కోరుకోమన్నాడు. అప్పుడు కార్తవీర్యుడు 'నాకు వేయి హస్తాలు, సమస్త జీవులను పరిపాలించే శక్తి, సంపద, యుద్ధాలలో విజయము, ధర్మ తత్పర బుద్ధి, భూమిపై, ఆకాశంలో, పాతాళంలో, జలములో, పర్వతాలలో అకుంఠితంగా ప్రయాణించగల రథములో ఎక్కడికైనా వెళ్ళగల శక్తిని ప్రసాదించ'మని కోరాడు.

దత్తాత్రేయుడు 'సరే! ధర్మప్రతిష్ఠ చేసి, భక్తి యాగాన్ని లోకంలో చాటి, వర్ధిల్లు! అధర్మంతో ఋషులను బాధిస్తే నా వరాలు నిన్ను రక్షించవు' అని హెచ్చరించి పంపుతాడు. కార్తవీర్యార్జునుడు తన రాజ్యానికి వెళ్ళి, అజేయుడై ధర్మబద్ధంగా చాలా కాలం రాజ్య పరిపాలన చేసి, భూమిపై మళ్ళీ ధర్మప్రతిష్ఠ చేసి, బాల్యంలో ప్రబలిన అధర్మాన్ని నశింపజేసి, యజ్ఞయాగాలతో బ్రహ్మర్షులను పూజించి, ధర్మాన్ని పూర్వస్థితికి తీసుకువచ్చాడు. తన బాహుబలంతో భూమండలమంతా జయించి, ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పరచాడు. నిరంతరం దత్తాత్రేయుని పూజిస్తూ వుండేవాడు. అంతా చేశాక, కాలం మూడింది. జమదగ్ని మహర్షిని అన్యాయంగా బాధించి, పరశురాముని చేతిలో మరణించాడు.

జంభాసురుడు అనే రాక్షసుడు ఇంద్రాది దేవతలను యుద్ధంలో ఓడించి, నానా బాధలూ పెట్టసాగాడు. సంవత్సరం పాటు దేవతలు అన్ని ప్రయత్నాలు చేసి వాడిని ఓడించలేక, గురువైన బృహస్పతి సందేశంతో వారంతా దత్తాత్రేయుని ఆశ్రయించారు. ప్రథమంలో దత్తాత్రేయుడు వారికి శ్రీలక్ష్మీ సహితుడైన నారాయణునిగా, గంధర్వులందరూ ఆయనను సేవిస్తున్నట్లుగా దర్శనమివ్వగా దేవతలందరూ భక్తిగా నమస్కరించారు. మళ్ళీ వెంటనే మామూలు మానవులను ఎలా మోసం చేశారో అలాగే తాగినవాడిలాగ తందనాలాడటం ప్రారంభించారు. కానీ దేవతలు తమ భక్తిని విడవక ప్రార్థించగా, వారిద్వారా జంభాసుర వృత్తాంతం విని దేవహితం చేయడానికి అంగీకరించి, 'నేను వాడితో యుద్ధం చేస్తానని చెప్పి తీసుకురమ్మ'న్నారు.

జంభాసురుడు పెద్ద సైన్యంతో దత్తాత్రేయుని ఆశ్రమానికి వచ్చాడు. ఆశ్రమంలో అతనికి శ్రీమహాలక్ష్మి ఒక అందమైన యువతి లాగా కనబడింది. వాడు కామమోహితుడై ఆమెను అపహరించాడు. అప్పుడు దత్తాత్రేయుడు ఇంద్రాదులను పిలిచి 'లక్ష్మి ఇప్పుడు దానవులకు శిరస్సున ఎక్కింది. అంటే వారిని వదిలేసింది. ఇప్పుడు దైత్యులు బలహీనులు. మీరు యుద్ధంలో వారిని తేలికగా చంపగలరు' అని తెలిపాడు. లక్ష్మిని అపహరించడం అనే పాపం చేత వాళ్ళ పుణ్యం క్షీణించి, లక్ష్మీ యోగం పోయి, దేవతల చేతిలో మరణించడం జరిగింది. ఈ విధంగా దత్తాత్రేయుడు రాక్షస సంహారానికి, దేవతల విజయానికి కర్తృత్వం వహించకనే పని పూర్తి చేయించాడు.

- సశేషం

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

శ్రీకృష్ణ భగవానుడు అరునుణ్ణి క్షత్రియోచితంగా యుద్ధం చేయమన్నాడు. ఎందువల్ల అంటే, అది అర్జునుడికి స్వధర్మాచరణం అవుతుంది గనుక. సన్యాస స్వీకారం, భిక్షాటనం అనేవి కూడ నిస్సంశయంగా ఆత్మానుభూతిని పొందించే మార్గాలే అయినా, అవి అర్జునుడికి మాత్రం ఆచరణీయమైన మార్గాలు కావు. ఎందుకంటే, అవి అర్జునుడికి స్వధర్మం కావు కనుక.

ఈ ఆటుపోటులలో, అర్జునుడి అంతరాంతరాలలో అట్టడుగున ఎక్కడో దాగి ఉన్న భయం ఇప్పుడు బయటకు వచ్చింది. అందువలన ఇప్పుడు అర్జునుడు "కృష్ణా! యుద్ధం జరిగితే మనం గెలుస్తామో, లేదా కౌరవులే జయిస్తారో మనకు తెలియదు. జయాపజయాలు దైవాధీనాలు. శత్రువులు కూడ సామాన్యులేమీ కారు. వారిని తప్పక జయిస్తాము అని చెప్పటానికి వీలులేదు. ఒకవేళ మనమే గెలుస్తామని అనుకున్నా పెదతండ్రి కుమారులను చంపి మేము నిశ్చితంగా ఎలా ఉండగలము? ఒకవేళ ఓడిపోవటమేం జరిగితే ఇక చెప్పేదేమున్నది? ఆలోచించి చూస్తే యుద్ధము యొక్క ఫలితము ఏదైనా నాకు సుఖం మాత్రం లేదు అనిపిస్తున్నది" అన్నాడు.



అర్జునుడికి శత్రుసైన్యంలోని వీరుల బలసంపద తెలియదు అనటానికి వీలులేదు. ఉత్తర గోగ్రహణ సమయంలో తానొక్కడే భీష్మద్రోణ పరిరక్షితమైన కురు సైన్యాన్ని ఓడించి, కర్ణాది వీరులను నిగ్రహించి, కురురాజును పరాభవించి, విజయమును సాధించిన అర్జునుడికి కురువీరులతో యుద్ధం చేయటం క్రొత్త ఏమీకాదు.యుద్ధభూమికి బయలుదేరేటప్పుడు, అర్జునుడికి విజయమును గూర్చిన సందేహమే లేదు. కాని మనస్సులో ఎక్కడో రహస్యంగా భయం దాగి ఉన్నది. అది ఇంతవరకు బయట పడలేదు. కాని ఆసక్తి బయట పడగానే, ఈ భయం కూడా బయట పడింది.

శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి, ఆతడికి కలిగినది క్షుద్రమైన హృదయ దౌర్బల్యమే కాని, ఉదాత్త గుణమైన కరుణ కాదు అని స్పష్టం చేసి, పరుష వచనాలతో, ఇంకా నీలో మగటిమి మేలుకోలేదా అని అతడిని మందలించాడు. శ్రీకృష్ణ భగవానుని ఈ మందలింపుతో అర్జునుడిలోని సాధకుడు మేలుకొన్నాడు. అందువలననే అర్జునుడు "కృష్ణా! కార్పణ్యదోష భూయిష్టమైన నా మనస్సు వికలమై ఉన్నది. స్వభావ సిద్ధమైన నా వివేకం నశించి, నా మనస్సు ధర్మాధర్మ విచక్షణా సామర్థ్యాన్ని కోలుపోయి మూఢత్వం పొందింది. నీకు శిష్యుణ్ణి. నన్ను నేను నీకు సంపూర్ణంగా సమర్పించుకుంటున్నాను. నిన్నే శరణు పొందుతున్నాను. నాయందు ప్రసన్నుడవై నాకేది శ్రేయస్కరమో నీవే నిశ్చయించి నన్ను శాసించు" అని ప్రార్థించాడు.

ఇప్పుడు మనకు నిజమైన సాధకుడైన అర్జునుడు కనబడుతున్నాడు. ఈ అర్జునుడే లేని పక్షంలో అంటే, అర్జునుడిలోని ఈ సాధకుడు మేలుకొని ఉండని పక్షంలో శ్రీకృష్ణ భగవానుడు గీతను బోధించి ఉండేవాడు కాదు. అర్జునుడి బుద్ధి కలుషితమై, మేఘావృతమైన ఆకాశంలాగ అయింది. అంతేకాని వినష్టము ఎంత మాత్రము కాలేదు. అది ఇప్పుడు మేలుకొన్నది. ఈ సాధకుడిగా మేలుకొన్న అర్జునుడికి మాత్రమే గీతోపదేశం జరిగింది.

అర్జునుడిలో మేలుకొన్న ఏ సాధకుడికి గీతోపదేశం జరిగిందో, అటువంటి సాధకుడే నీలో కూడా ఉన్నాడు. అర్జునుడిలోని సాధకుడికి ఏ పరిస్థితులలో గీతోపదేశం జరిగిందో అటువంటి పరిస్థితులు నీకు జీవితంలో అడుగడుగునా ఎదురవుతాయి. అందువలననే, అర్జునుడికి గీతకు మధ్య ఎటువంటి సంబంధం ఉన్నదో, నీకు గీతకు మధ్య కూడా అదే సంబంధం ఉన్నది. గీతామృతాన్ని గ్రోలి అర్జునుడు, ఆ భగవానుని ప్రసాదముతో మోహాన్ని పోగొట్టుకొని, స్వధర్మాచరణంతో యోగాన్ని సాధించి ఎలా జ్ఞానవంతుడైనాడో, అలాగే నీవు కూడా జ్ఞానవంతుడవు కావాలి.

- సశేషం

# భూతదయాం విస్తారయ

- సన్నిధానం కాళీమాత

**అవినయ మపనయ విష్ణో। దమయ మనః శమయ విషయ మృగతృష్ణామ్।**
**భూత దయాం విస్తారయ। తారయ సంసార సాగరతః॥**

శ్రీ శంకరాచార్య విరచిత విష్ణుషట్పదీ స్తోత్రంలోని పద్యమిది. సంసార సాగరం నుంచి తరించడానికి విష్ణుమూర్తిని వేడుకుంటూ అందుకు అవసరమైన గుణాలు ఇవ్వమని ప్రార్థించడం జరుగుతోంది.


అవినయమనేది నాకు లేకుండా చేయి స్వామీ! మనస్సుని నిర్మూలించుకోగలిగేలా అనుగ్రహించు. విషయ మృగతృష్ణలను అంటే వాటి యందే సుఖము ఉందనే భ్రమతో వెంటపడతాను గాని నిష్ఫలము గదా! వీటి అన్నిటితో పాటు, విస్తారమైన భూతదయను అంటే చాలా ఎక్కువగా భూతదయ కావాలి. అని ఈ పద్యంలో శ్రీశంకరాచార్యులు ప్రార్థించడం జరుగుతోంది.

'**నీ పాద కమల సేవయు**' పద్యంలో కూడా '**నితాంత అపార భూతదయను**' ఇవ్వమని మనం రోజూ ప్రార్థనలో వేడుకొంటాము. సాధకులకైనా, సామాన్య జనులకైనా అపార భూతదయ చాలా ముఖ్యం. ఏ జీవినీ కూడా మానసికంగా గాని, శారీరకంగా గాని, బాధ పెట్టరాదు. దాని వలన వచ్చిన కర్మ ఫలములు అనుభవించడానికి మరిన్ని జన్మలు పట్టవచ్చు.

దేవలుడు అనే మహర్షి ఒకనాడు గంగాస్నానం చేస్తుండగా, అదే సమయంలో "హ హ", "హూ హూ" అనే ఇద్దరు గంధర్వులు వారి ప్రియ కాంతలతో జలక్రీడలాడుతున్నారు. దేవల మహర్షి ఎంతో పుణ్యం, తపస్సంపద కలిగి యవ్వనంతో ఆరోగ్యంగా వున్నాడు. ఆయన స్నానం చేస్తూ, మంత్రోచ్చారణ చేసుకుంటూ, ధ్యాన నిష్ఠలో వుండి కనిపించే సరికి, ఆ గంధర్వులకి అమాయక బ్రాహ్మణునిలా కనబడ్డాడు. ఆయనను భయపెట్టాలని వారిలో ఒకడు నీటిలో మునిగి ఆ ముని కాలు పట్టుకుని లాగాడు. దానితో ఆ మహర్షికి కోపం వచ్చింది.

'నీళ్లల్లో వున్నప్పుడు మరొకరి కాలు పట్టుకుని లాగేది మొసలి ఒక్కటే. కాబట్టి నీవు ఉత్తరజన్మలో మొసలిగా పుట్టి తీవ్ర బాధలు పడతావు. ఇప్పటి ఈ పాపానికి శిక్షగా ప్రాణాలు పోయే పరిస్థితి తెచ్చుకుంటావు'

అని గంధర్వుణ్ణి శపించాడు. ఒకడు ఎంతటి పాపం చేస్తాడో, ఆ పాపానికి అలాంటి లక్షణాలకి అనుగుణమైన శరీరము అతడికి మహర్షులు ప్రసాదిస్తారు. అది శాపం అనవచ్చు. అందుకే ఆ గంధర్వుడు మొసలిగా పుట్టవలసి వచ్చింది.



దేవల మహర్షి శాపం పొందాక, ఆ గంధర్వుడికి తన తప్పు తెలిసివచ్చింది. 'బుద్ధి చాంచల్యం వలన మహా పాపం చేశాను. తమరు నాకు తగిన శాపమే ఇచ్చారు. నన్ను అనుగ్రహించి శాప విమోచనం కూడా తెలపండి' అని ప్రార్థించాడు. అప్పుడు దేవల మహర్షి 'సరే! క్షమిస్తున్నాను. ఆగ్రహంతో నీకు శాపం ఇచ్చినందుకు, నీకొక ఉపకారం కూడా చేయదలచాను. మొసలిగా నీవు ఒక ఏనుగును బాధిస్తావు. శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో నీవు ఆయన చేతిలో మరణించి, నీ మొసలి శరీరం పోయి, మోక్షం వస్తుంది' అని చెప్పారు.

వారు మహర్షులు కనుక శాపమిచ్చినా తిరిగి అనుగ్రహించడం జరిగింది. ఇది అసామాన్యమైన విషయం. ఆ మొసలే గజేంద్రమోక్షం గాధలోని మొసలి. గజరాజును పట్టుకుని, చివరకు శ్రీమహావిష్ణువు చేతిలో మరణం, మోక్షం పొందాడు.

ధనం, పదవి, అందం, అవకాశం కారణాలుగా ఎవరినైనా, శారీరిక, మానసిక బాధలకు గురిచేస్తే, దానికి తగిన ఫలితంగా ఆ లక్షణాలతో మళ్ళీ జన్మలు ఎత్తవలసినదే. భక్తులు, సాధకులు వివేకవంతులై, శ్రీ శంకరాచార్యులు శ్రీవిష్ణు షట్పదిలో ప్రార్థించినట్లుగా, **'భూతదయ విస్తారయ, నితాంత అపార భూతదయ'**లను నిజ జీవితంలో అలవరచుకోవాలి. లేనిచో జన్మ పరంపరలలో చిక్కి మోక్షమార్గమునకు మరింత దూరం కావడం జరుగుతుంది.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**41. ఓం పరంధామాయ నమః**

ఏ ధామాన్ని చేరుకుంటే తిరిగి రానవసరం లేదో – అనగా పునర్జన్మ లేదో, యే ధామం యొక్క ప్రకాశము ముందు సూర్యతేజము సైతం వెలవెల పోతుందో, అటువంటి స్వయంప్రకాశమానమైన ఉత్తమోత్తమమైన పరంధామానికి అధిపతి శ్రీగురుదేవులు. అనుక్షణమును, అంత్యకాలమునను శ్రీగురుదేవుల రూప, నామములను మనస్సునందు, జిహ్వాయందు నిలుపుకొన్న నాడే మనము ఆ ధామాన్ని చేరుకోగలుగుతాము.

**42. ఓం భవ బంధ విమోచనాయ నమః**

మనలను ఈ భవ బంధముల నుండి విముక్తులను చేసే శక్తి శ్రీగురుదేవులకు మాత్రమే ఉన్నది. నిజానికి ఈ భవము మనలను బంధించలేదని, మనము నిత్యము, శాశ్వతము అయిన ఆత్మ స్వరూపులమని తమ బోధనల ద్వారా మనకు బోధ పరచి మన స్వస్వరూప స్థితిని ప్రసాదించ గలిగినది శ్రీగురుదేవులు మాత్రమే.

**43. ఓం నిస్తులాయ నమః**

శ్రీ గురుదేవులతో సమానమైన వారు, వారితో పోల్చదగిన వారు ఈ ప్రపంచములో మరియొకరు లేరు. వారికి వారే సాటి. గురు అనే శబ్దానికి అన్నిటికన్నా ఉత్తమమైనది అనే అర్థము ఉన్నది. నీవు ఎంతటి ఉత్తమమైన వస్తువును భావించినా అంతకంటే ఉత్తమమైనది గురు తత్త్వం. అందుకే వారు సాటిలేని వారు.

**44. ఓం నిరహంకారాయ నమః**

సర్వ తత్వ స్వరూపులై, సర్వత్రా ప్రకాశించు శ్రీగురుదేవుల తత్త్వంలో అహంకారమునకు ఎంతమాత్రము స్థానము లేదు. ఎప్పుడైతే అహం బ్రహ్మోస్మి అన్న జ్ఞానం కలుగుతుందో ప్రపంచమంతా బ్రహ్మ స్వరూపంగా గోచరిస్తుంది. అప్పుడు ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే భావనకు గానీ, అహంకారమునకు గానీ చోటెక్కడిది?

**45. ఓం నిర్వ్యాజ కరుణా నిధయే నమః**

శ్రీ గురుదేవులు నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షము గలవారు. వారు అపార కరుణా సాగరులు. వారి కరుణ కారణము లేనిది, అపారమైనది, ఫలాపేక్ష లేనిది. మనపై అపార కరుణ వర్షించటం ద్వారా వారు పొందగోరేది కానీ, పొందవలసినది కానీ ఏదీ లేదు. జీవులు తమ కర్మ పుత్రులపై చూపే ప్రేమ ప్రతిఫలాపేక్షతో కూడినది. కానీ శ్రీగురుదేవుల ప్రేమ అవ్యాజమైనది.

**46. ఓం నిర్మలాయ నమః**

ఏ గురుదేవుల దివ్య నామ స్మరణ మాత్రముననే, దివ్య రూప దర్శన మాత్రముననే మనలోని సకల కలుషాలు, దోషాలు హరించి మనస్సు నిర్మలము అవుతుందో అట్టి గురుదేవులకు మలినం ఎలా అంటుతుంది? వారిని మలత్రయం ఏమీ చేయలేదు. ఎంతటి మలిన మనస్సు అయినా వారిని ధ్యానిస్తే నిర్మలము అవుతుంది.

**47. ఓం నియమాయ నమః**

శ్రీ గురుదేవులు ఇంద్రియములకు, మాయకు అతీతులు. శ్రీగురుదేవుల దివ్య ప్రభావము వలననే మాయ సర్వ ప్రకృతిని నియమిస్తోంది. అటువంటి మాయకు శ్రీగురుదేవులను నియమించే శక్తి లేదు. కానీ మనకు నేర్పటానికి మాత్రమే వారు నియమవంతులుగా, ఇంద్రియ నిగ్రహము కలవారిగా కనిపిస్తారు. కానీ నిజానికి వారికి వాటితో పని లేదు.

**48. ఓం నిత్యాయ నమః**

శ్రీ గురుదేవులు నిత్యులు, శాశ్వతులు. వారికి ఆది, అంతములు లేవు. ఏది సత్యమైనదో అదే నిత్యమైనది. శ్రీగురుదేవులు సత్, చిత్, ఆనంద స్వరూపులు కనుకనే వారు నిత్యమైన వారు.

**49. ఓం నిర్లిప్తాయ నమః**

తామరాకు నీటిలోనే వున్నను దానిపైన ఏమాత్రము తడి అంటనట్లు, ఒక చుక్క నీరు కూడ నిలువనట్లు, శ్రీ గురుదేవులు సాకారులై వచ్చి, ప్రాపంచిక విషయములలో మునిగి పోయివున్న మన మధ్యకు వచ్చి మనతో వుంటున్నా, ఈ ప్రపంచములోని ఏ విషయాలు, కర్మలు, కర్మఫలాలు వారికి అంటవు. వారిని కదిలించలేవు. వారు వీటన్నింటికీ అతీతులు.

**50. ఓం నిరుపద్రవాయ నమః**

శ్రీగురుదేవులను ఏ ఉపద్రవాలు, ఏ ఉత్పాతాలు ఏమీ చేయలేవు. వారినే కాదు వారిని నమ్ముకున్న శిష్యులను కూడా ఏమీ చేయలేవు. ఎంతటి ఉపద్రవాలు ఎదురైనా, మహా ప్రళయమే సంభవించినా గురు పాదాలను ఆశ్రయించిన శిష్యుడు ఏ మాత్రం కలత చెందవలసిన పని లేదు. ఎందుకంటే అవి వారి పాదపీఠం దరికి కూడా చేరలేవు. గురుదేవుల ఆజ్ఞ ప్రకారము శ్రీ లలితానంద సరస్వతిస్వామివారు నిర్జీవమైన తమ సోదరి శరీరము వద్ద ధ్యానమగ్నులై ఉన్న తరుణంలో, శ్రీ సద్గురుదేవులు గరుడ వాహనుని రూపంలో వారి సోదరికి దర్శనమిచ్చి పునర్జీవితురాలిని గావించిన ఉదంతము మనకు తెలిసినదే కదా!


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

"పార్థా!" రథం వెనుక భాగంలో దాదాపు సమాధి స్థితిలో ఉన్న అర్జునుణ్ణి సంబోధిస్తూ దారుకుడు "మనం రైవత పర్వతం కనుచూపు మేరలో ఉన్నాం" అన్నాడు. అర్జునుడికి దారుకుని మాటలు వినిపించినట్లు లేదు. అతడు రెప్పవేయకుండా నిశ్చలంగా రైవత పర్వతాన్ని చూస్తున్నాడు. భుజానికి తగిలించి ఉన్న గాండీవం మీద వున్న అర్జునుని చెయ్యి చెమటతో తడిసిపోయింది. అర్జునుడి మనస్సులో పాత జ్ఞాపకాలు మెదిలాయి. ఈ రైవత పర్వతం అవతల ఉన్న లోయలోనే కదా తాను పూర్వం సన్యాసివేషంలో వచ్చి సుభద్రను అపహరించుకొనిపోయాడు! అప్పుడు శ్రీకృష్ణుడే స్వయంగా 'అర్జునా! ఈమె నా చెల్లెలు సుభద్ర. ఈమె నిన్నే వలచి వివాహమాడాలని కోరుతున్నది. మా అన్న బలరాముడు ఈ వివాహానికి అంగీకరించడు. ఈమెను వివాహమాడదలిస్తే నీవు సన్యాసివేషంలో వచ్చి ఆమెను అపహరించి తీసుకొనివెళ్ళు. క్షత్రియులకు ఇలా కన్యలను తీసుకొని వెళ్ళి వివాహమాడటం నిషిద్ధం కాదు' అన్నాడు.



కృష్ణుని ఆ వాక్కులు ఇప్పుడుకూడా గాలిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఏది ధర్మసమ్మతమో, ఏది ధర్మవిరుద్ధమో కృష్ణుడు తనకు మాటిమాటికీ చెప్పినవన్నీ అర్జునుని చెవులలో గింగిరుమంటున్నాయి. ఈనాడు.....ఆ ఆలోచన రాగానే అతని శరీరం చెమటతో తడిసిపోయింది. అయినా దుర్భరమైన ఆవేదనతో దహించుకుపోతున్నది. సరిగ్గా 30 సంవత్సరాలక్రితం ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధభూమిలో ఇరువైపుల సైన్యాలలోని బంధువులను చూచినప్పుడు, తన సర్వాంగాలు శిథిలమై గాండీవం చేజారిపోయినప్పుడు ఎలా ఉందో అటువంటి స్థితి మళ్ళీ ఇప్పుడు ఎదురౌతున్నది. గొంతు ఎండిపోతున్నది.

"కౌంతేయా! దుర్గం తూర్పువైపు కందకంలో సముద్రపునీరు నిండుతున్నది. మనం పశ్చిమద్వారం గుండానే లోపలికి వెళ్ళాలి" అన్నాడు దారుకుడు అర్జునుడి ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తూ.

అర్జునుడు ఏమీ మాట్లాడలేదు. రథం తూర్పువైపు వెళ్ళితే ఏమిటి? పశ్చిమంవైపు వెళ్ళితే ఏమిటి? కృష్ణుడు లేని ద్వారకతో తనకేమి పని? అసలు అటువంటి కృష్ణుడు లేని ద్వారకలో ప్రవేశించటం అనేది తను ఊహించనైనా ఊహించలేనిది.

అర్జునుడు ఇక కొద్ది క్షణాలలో ద్వారక ప్రవేశిస్తాడు. కాని ఇప్పుడు అక్కడ ఇంతకు పూర్వంలా కృష్ణుడు కనిపించడు. బలరాముడు లేడు. సాత్యకి, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు ఎవ్వరూ లేరు. ఉద్ధవ, అక్రూరులు కూడా లేరు. వీరెవరూ లేని ద్వారక వెలవెలపోతున్నది. 12 యోజనములు విస్తరించిన ఈ భూఖండము మోడువారి ఉన్నది. ఒకప్పుడు అసలు అక్కడ ద్వారక అనేదే లేదు. శ్రీకృష్ణుడు అక్కడ ద్వారకను నిర్మింపచేశాడు. ఆ ద్వారక, రైవత పర్వతం వేలు పట్టుకొని నుంచున్నట్లు ఉన్నది.

అర్జునుడి దృష్టి రైవత పర్వతం వైపు తిరిగి అక్కడ నిలిచి పోయింది. ఇప్పుడు అతడికి సుభద్ర గుర్తు రాలేదు. బ్రహ్మలోకం నుంచి ఏవో మృదు మధురమైన సంగీత ధ్వనులు చిరుగాలి తరగల పైన తేలియాడుతూ వినిపిస్తున్నాయి. ఈ సంగీతం...

.....అలనాడు సత్యయుగంలో బ్రహ్మదేవుని సంగీతసభలో రైవతరాజు, అతని పుత్రిక ఆలకించిన స్వరమాధురీ ఝురులు కావుకదా! త్రేతాయుగం గడిచిపోయింది. కృష్ణుని దేహత్యాగంతో ద్వాపరాంతం కూడా అయినట్లే, అయినా ఇప్పుడు కూడా బ్రహ్మలోకం నుండి రైవత పర్వత శిఖరాలమీదుగా ఆ సంగీత వీచికలు ఇంకా వీనులవిందు చేస్తున్నాయా! లేక తాను పొరబడటం లేదుకదా! ఆ వినిపిస్తున్న శ్రావ్యమైన ధ్వని శ్రీకృష్ణుని మురళీ రవళి కాదు కదా!


- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 40: లభ్యతేపి తత్కృపయైవ**

**తాత్పర్యము:** "భగవద్భక్తి కేవలం భగవంతుని కృప వలన మాత్రమే లభిస్తుంది."



ఈ సూత్రము ద్వారా నారదుల వారు ముందు సూత్రములలో వివరింపబడిన "పరా భక్తి" కేవలం భగవంతుని కృప వలన మాత్రమే కలుగుతుందనీ, మన శ్రమ, జ్ఞానం, ప్రయత్నం వల్ల మాత్రమే కాదనీ తెలియచేస్తున్నారు. అంతే కాక ఈ సూత్రం **"న అయం ఆత్మా ప్రవచనేన లభ్యః న మేధయా న బహునా శ్రుతేన"** అని చెప్పబడిన కఠోపనిషత్తు భావాలను ప్రతిబింబిస్తుంది.

భగవద్భక్తి అనేది ఒక దివ్య అనుగ్రహమనీ జ్ఞాన, కర్మ, యోగ మార్గాలతో పోల్చినపుడు భక్తిమార్గం చాలా విభిన్నమని ఈ సూత్రం తెలియచేస్తోంది. మనలో అహంకారాన్ని తగ్గించేందుకు, వినయాన్ని పెంచేందుకు ఈ సూత్రం ఎంతో ఉపయోగపడుతుంది. మనం ఎంత పాండిత్యం కలిగి ఉన్నా, ఎంత యత్నిస్తున్నా భక్తి అనేది ఇచ్చే దేవుడి కృపపై ఆధారపడి ఉంటుందని ఈ సూత్రం ద్వారా నారదులు వివరిస్తున్నారు.

ఎంతో చిన్న వయసులోనే తపస్సు చేసి శ్రీ మహావిష్ణువును ప్రత్యక్షం చేసుకున్న ధ్రువుని విషయంలో ఈ సూత్రం అక్షర సత్యమని చెప్పవచ్చు. భక్తి అనేది అనుగ్రహంగా వచ్చేదనీ, మన యోగ్యత కన్నా, ఆయన దయే ఎక్కువ అనీ ఈ సూత్రం తెలియచేస్తోంది.

భక్తి సూత్రము 41: **తస్మిన్ తజ్జనే భేదాభావాత్**

**తాత్పర్యము:** భగవంతునిపై ప్రేమ ఉన్నవాడు, ఆయన భక్తులపట్ల కూడా భేదభావం లేకుండా ప్రేమ చూపుతాడు.

నిజమైన భక్తుడు భగవంతుణ్ణి మాత్రమే కాదు, ఆయనకు అంకితమైన భక్తులను కూడా అదే ప్రేమతో చూసేవాడవుతాడు. ఈ సూత్రం భక్తి యొక్క విశిష్ట లక్షణం గురించి చెబుతోంది. నిజమైన

భక్తుడు భగవంతుని సాక్షాత్కారం పొందాలని కేవలం ఆరాటపడడు. భగవంతునికి ప్రియమైన వారిని కూడా తనకు ప్రియంగా భావిస్తాడు. అంతే కాక తనకు, ఇతర భక్తులకు మధ్య భేదం లేదు అనే అనుభూతిని కలిగి ఉంటాడు. భగవద్గీతలో గీతాచార్యులు "నా భక్తుల పట్ల భక్తిని కలిగినవాడు నాకు అత్యంత ప్రియమైన భక్తుడు" అని సెలవిచ్చారు. శ్రీ బాబూజీ మహారాజ్ వారు కూడా ఎప్పుడూ తమతో పాటు వచ్చిన భక్తులను ముందుగా ఆదరించమని బోధించే వారు. మనం భగవంతుని ప్రేమిస్తున్నామా, లేదా అనే అసలైన పరీక్ష మనం ఆయన భక్తులను ఎలా చూస్తున్నామనే దానిలో ఉంటుంది. నిజమైన భక్తుడు ఇతరుల భక్తిని అంగీకరిస్తాడు కానీ విమర్శించడని దీని భావము.

**భక్తి సూత్రము 42: తదేవ సాధ్యతాం తదేవ సాధ్యతాం**

తాత్పర్యము: "భక్తినే సాధ్యంగా ఉంచాలి, భక్తినే సాధ్యంగా ఉంచాలి."

సాధకుడు భగవద్భక్తినే జీవిత లక్ష్యంగా, సాధనగా, పథంగా, ప్రాణంగా భావించాలని ఈ సూత్రము తెలియచేస్తోంది. జ్ఞానం, యోగం, కర్మ వంటి మార్గాలన్నీ భగవద్భక్తిలో విలీనమవుతాయి. భగవద్భక్తికి వున్న అడ్డంకులు సర్వాత్మ సమర్పణ ద్వారా మాత్రమే తొలగిపోతాయి. ఆత్మ సమర్పణకు అహంకార మమకారములే బంధనములవుతాయి.

**"తదేవ సాధ్యతాం"** అన్న పదాల పునరుక్తి ద్వారా నారదులు భక్తికి ఉన్న ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నారు. ఆధ్యాత్మిక మార్గంలో చివరి దశగా, ఫలంగా, భక్తినే నిలబెడుతూ భక్తిని సాధించడమే జీవిత పరమార్థమని ఈ సూత్రము ద్వారా నారదులు వివరిస్తున్నారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఖండవల్లి గ్రామ నివాసస్తులు అయిన శ్రీ కామిన పాండురంగారావు గారు 21-7-2025 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 64 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# సాధన

-ఎన్. కుట్టీ

బ్రహ్మా సత్యం. నీవు సత్య స్వరూపుడవు. నీవు సత్య స్వరూపుడవైనప్పుడు నీవూ బ్రహ్మామే. నీవు బ్రహ్మాము అయినప్పుడు ఈ సృష్టి అంతా నీలో నుండి వుధ్భవించినదే. ఈ మనుష్యులు, పశుపక్ష్యాదులు, చెట్లు, చేమలు అన్నీ నీలోనుండి వుధ్భవించినవే. ఈ కనబడే రూపాలన్నీ నీవే. ఆలోచిస్తే, అక్కడ రామయ్య, సోమయ్య, సీత, సుధ అనేవారు లేరు. అంతానీవే. నిన్ను నీవే సృష్టించుకున్నావు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అన్నీ నీలో నుండి పుట్టినవే. నీ పరిస్థితులు నిన్ను ఇబ్బంది పెడుతుంటాయి. దిగులు పడకూడదు. నిన్ను తీర్చిదిద్దేందుకు బ్రహ్మాము నిన్ను గురురూపంలో పరీక్ష పెడుతున్నాడు. ఆ పరీక్షలను గురుప్రసాదంగా భావించి వాటిని ఎదిరించు. అవన్నీ నిన్ను చూసి భయపడి నిన్ను అనుసరిస్తాయి.

కర్మను భగవంతుని ప్రసాదంగా భావించి, ఆచరించు. ఆలోచించి మాట్లాడు. అవసరమైన మాటలే మాట్లాడాలి. అనవసర ప్రేలాపనలను చేయకూడదు. మౌనంగా ఉండటం అలవరచుకోవాలి. మనస్సును ఛిద్రం చేసే రోగం మనసుకు ఉంది. దానికి లోబడకూడదు. అదే అశుద్ధ మనస్సు. భగవంతుని మార్గంలో నడిచే మనస్సే శుద్ధ మనస్సు. దీనినే అనుసరించాలి. అదే నిన్ను ముక్తి మార్గంలో నడిపిస్తుంది. గురువే బ్రహ్మా. గురుదేవులు తెలిపినట్లు నడచుకొని, ఆచరిస్తే, నీవు పరమాత్మ స్వరూపాన్ని పొందగలవు. ప్రపంచంలో నీవు ఉన్నావా? లేక ప్రపంచం నీలో వున్నదా? ఆలోచించుకో. నీలో ప్రపంచం వున్నదని తెలుసుకో. అదే సత్యం. దాని కొరకు సాధన చెయ్యి. అప్పుడు ఆత్మ అంటే, పరబ్రహ్మాం అంటే, సద్గురువు అంటే ఎవరో తెలుస్తుంది.

మాయయే ద్వంద్వం. ఆ ద్వంద్వం వలన అన్నీ రెండుగానే కనిపిస్తాయి. ద్వంద్వం వీడినప్పుడు వున్నది ఒక్కడే అని తెలుస్తుంది. ఆ ఒక్కటీ చైతన్యము అని తెలుస్తుంది. మానవుడు తన ఆఖరి నిమిషం వరకూ సాధన చేయకుండా, బాల్యమంతా వృథా చేసుకుని, తన అహంకారముతో యౌవనం అంతా పాడుచేసుకుని, వృద్ధాప్యం రాగానే శరీరం అంతా వణుకుతుండగా, దేహము ముడతలు పడుతుండగా, ఏమీ చేయలేక, అనారోగ్యముతో, బాధతో, ధ్యానించే శక్తి లేక, అప్పుడు భగవంతుడు తనను రక్షించాలంటే ఎలా? అప్పుడు కూడా ఆ జీవికి జన్మ లేకుండా చేస్తానంటున్నారు గురుదేవులు. ఎలా అంటే, ఏ ఆలోచనలు లేక, భగవంతునిపై దృష్టి నిలిపితే రక్షిస్తాను అంటున్నారు. భగవంతుడు తప్పక అనుగ్రహిస్తాడు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఆగస్ట్ 2025**

8 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

9 శని : శ్రావణ పూర్ణిమ - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

17 ఆది: శ్రీ కృష్ణాష్టమి - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

18 సోమ: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

21 గురు: మాసశివరాత్రి

23 శని : అమావాస్య

27 బుధ: వినాయకచవితి - తె.జా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ. ఉ.11.00 గం.లకు సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

**సెప్టెంబర్ 2025**

5 శుక్ర: ఉపాధ్యాయ దినోత్సవం

7 ఆది: భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాదపూజ

16 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

20 శని: మాసశివరాత్రి

21 ఆది: అమావాస్య

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - ఉ. 8 గం.లకు అంకురార్పణ.

29 సోమ: మూలా నక్షత్రం - సరస్వతీ పూజ

30 మంగళ: దుర్గాష్టమి - సామూహిక కుంకుమ పూజలు

# ఖాళీ పాత్ర

- పెనుమాక నాగేశ్వర రావు

పాత్రనెరిగి దానం చేయమని పెద్దలమాట. అంతేకాదు అపాత్రదానం చేయవద్దని కూడా నొక్కి వక్కాణించారు పెద్దలు. అయితే ఓ పెద్దమనిషికి ఓ సందేహం వచ్చింది. అదేమంటే అన్నదానం జరుగుతున్నదనుకోండి. ఆకలిగా వున్నవాడికి పెట్టటం సముచితం. అయితే ఇక్కడ పాత్రనెరిగి దానం చేయడం ఉంటుందా అనేది ఆ పెద్దమనిషి సందేహం. ఉంటుందనే సమాధానం చెప్పవచ్చు. ఎలాగంటే తాను తినడానికి వస్తే అతను అన్నదానం స్వీకరించడానికి యోగ్యుడే. కానీ ఇంటిదగ్గర వున్న తన కుటుంబసభ్యులందరికీ అన్నం పట్టుకు వెళ్ళాలని వస్తే అతను అర్హుడు కాదనే చెప్పాలి. అతని అవసరం న్యాయమైనదే కానీ అన్నదాన కార్యక్రమంలో అది ఆమోద యోగ్యం కాదనే చెప్పాలి.

ఇంతకీ అపాత్రదానం తగదు అని కదా చెప్పుకున్నాం. పాత్రత అనేది నిజానికి చాలా లోతైన విషయం. పాత్రోచితం అనే మాట కూడా మనం విన్నదే. సామాన్యంగా ఈ పదం నటుల విషయంలో వాడుతుంటాం. పాత్రోచితంగా నటించారు అని అంటుంటారు. నిజం చెప్పాలంటే మనం అందరం నటులమే. పుట్టిన దగ్గర్నుంచి పోయే వరకు మనందరం చాలా పాత్రలు పోషిస్తుంటాం. ఒక్కొక్క సందర్భంలో మన పాత్ర నిడివి మారుతుంటుంది, ప్రాధాన్యతా మారుతుంటుంది, ఆహార్యం, భాష వగైరాలన్నీ సందర్భానుసారం మారుతూ ఉంటాయి.

మనసు నిబ్బరంగా ఉంచుకో అంటుంటాం. మనసుని రాయి చేసుకోవాల్సిందే అనిపిస్తుంటుంది ఒక్కో సందర్భంలో. మనసున్న మనిషికి సుఖము లేదంతే అన్నారు కవులు. మనసు చంపుకోవాలండి తప్పదు అనే మాట కూడా అరుదుగా వినిపిస్తుంటుంది. మనసే మనిషికి బందిఖానా అని కూడా పాటలు వ్రాశారు రచయితలు. నీ మనసుకు నచ్చింది చెయ్యి అని హితవు పలికే విజ్ఞులు లేకపోలేదు. మనసుని నిగ్రహించుకోవటంలోనే ఉంది గొప్పతనం అనేవాళ్లూ తారస పడుతుంటారు.

తమాషా ఏమిటంటే మనం మన కాలు చూపించగలం, కన్ను చూపించగలం, చెయ్యి, పొట్ట, నోరు, ముక్కు, చెవి ఇలా మన అవయవాలన్నింటినీ చూపించగలం కానీ మనసుని మాత్రం చూపించలేము. మనిషి ఉన్నతికి గానీ పతనానికి గాని మనసే ప్రధానం అంటారు. మనసు పెట్టి చదివితే రాకుండా ఉంటుందా? మనసుపెట్టి పూజ చేసుకోవటం ముఖ్యం! హంగు, ఆర్భాటం కాదు అనే కదా చెబుతారు. మనిషిని ఓ ఆట ఆడించే మనసు, మనిషిని అల్లాడించే ఈ మనసు, అతలాకుతలం చేసే ఈ

మనసు, ఎవ్వరికీ కనిపించదు. ఎవ్వరికీ చూపించలేము. నిన్ను నీవు తెలుసుకో అంటే మన మనసు ఏమిటో మనం తెలుసుకోవటమేనేమో !

మనసు అంటే ఆలోచనల ప్రవాహం అని చెబుతోంది సైన్స్. ఆ మనసుని పరిపరి విధాలుగా ప్రవహించకుండా, ఒకే విషయం మీద కేంద్రీకరించటాన్ని ధ్యానం అంటున్నారు. సరే అసలు మనసుని ఎందుకు నియంత్రించాలి? అనే ప్రశ్న వేసుకుంటే చాలానే అవసరం కనిపిస్తుంది. నియంత్రణ లేని మనసు మనిషిని అనేక రకాల ఆకర్షణలకు గురిచేసే అవకాశం ఉంది. ఆకర్షణలకు లోనైన మనసు దానిని ఒక వ్యసనంగా మార్చుకునే ప్రమాదం ఉంది. కాబట్టి ఎవరైనా మనసుని వీలయినంత వరకు తమ స్వాధీనంలో ఉంచుకునే ప్రయత్నం చేసుకోవలసిన అవసరం కనిపిస్తున్నది. అది మానవప్రయత్నం తోనే సాధ్యమా అంటే, ప్రతిదీ మానవ ప్రయత్నానికి భగవంతుని ఆశీస్సులు కలిస్తే సాధ్యమే అని అనుభవజ్ఞులు చెబుతున్నారు.

కాబట్టి మనం ప్రయత్నం చేస్తూ భగవంతుడిని త్రికరణ శుద్ధిగా మనసుని నియంత్రించమని అడగాలి. అందుకు ముందు మన మనసు సిద్ధపడాలి. అలా సిద్ధపడటానికి మనం మన మనసుని ఖాళీ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే మామూలు లౌకికంగా చెప్పుకోవాలంటే మనకి ఓ వ్యక్తి కావలసిన సదుపాయాలన్నింటినీ సమకూరుస్తున్నాడు అనుకుందాం. వ్యయ ప్రయాసల్లో వ్యయం మనది, ప్రయాస అతనిది. శ్రద్ధాసక్తులలో శ్రద్ధ ఆయనది, ఆసక్తి మనది. అలా కొన్ని ఏళ్ళు గడిచాక ఏదో ఒక రోజు మనకి సాధారణంగా ఏమనిపిస్తుంది? ఇంతకాలం నుండి పాపం ఆయన మనం ఏది అడిగితే అది చేసి పెడుతున్నాడు. మనం ఒక్కసారి కూడా ఆయనకి ఏమీ చేయలేదు. అనిపిస్తుంది. కనీసం ఈ రెండు మాటలు ఆయనతోనే చెప్పుకో సంతోషిస్తాడు అని మన మనసే మనకి హితవు చెబుతుంది. అప్పుడు ఆయనకి కృతజ్ఞతతో పాటు మన మనసులో కలిగిన భావాల్ని కూడా తెలియచేస్తాం. ఆయన సంతోషిస్తాడు. మన మధ్యన దగ్గరితనం మరింత ఎక్కువతుంది.

ఇదే సూత్రం దేవుడి దగ్గరా పనిచేస్తుంది. ఇంతకాలంగా మనం అడగటం, ఆయన ఇవ్వటం, అడుగుతూనే ఉన్నాం, మహానుభావుడు ఇస్తూనే ఉన్నాడు. ఆయనకి ఏమివ్వగలం అనుకోగానే, నీ మనసులో నన్ను నిలుపుకో, లేదా నా మనసులో నీవే వుండేటట్లుగా మారిపో, మసలుకో అని దేవుడే చెప్పినట్లు మన మనసే మనకి చెబుతుంది. ఇంత జరగాలంటే మనం మన పాత్రతని తెలుసుకోవాలి. భాండ శుద్ధి లేని పాకమేల అని చెప్పాడు కదా వేమన గారు. అందుకే మనసులో ఆ దేవదేవుడిని ప్రార్థించాలి.

శ్రీ కైవల్యంబు కోరి కదా భాగవత రచనకు పూనుకున్నానన్నాడు పోతన గారు.. అలాగే ముందు మనకి మనం ఖాళీ పాత్రలమయితే, గురుదేవులు తరచుగా బోధించేటట్లు వేణువు లాగా మారితే ఖాళీ మనసులో ఇక ఆయనకు తప్ప వేరేవాటికి చోటు ఉండదు. నిండుకుండ తొణకదన్నది ఎంతనిజమో, ఖాళీపాత్ర కాళీప్రసాద దేవుని కృపకు పాత్రులు కావటం అంతే నిజం . అందుకే ఆ దారిలో ప్రయాణిద్దాం! ఓం నమో భగవతే కాళీప్రసాదాయ!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏవైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**ఆగస్ట్ 2025**

9 శని : శ్రావణ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

27 బుధ: వినాయకచవితి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**సెప్టెంబర్ 2025**

7 ఆది: భాద్రపద పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం .

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"యుక్తవయస్సులో నేను, నాసోదరుడు జటాయువు ఎవరు ఎక్కువ ఎత్తుకు ఎగురగలమని పోటీ పెట్టుకున్నాము. అలా ఎగురు కొనుచూ సూర్యమండలమువరకు వెళ్ళాము. సూర్యుని ఉష్ణ తీవ్రతకు తట్టుకోలేని జటాయువు "అన్నా నన్ను కాపాడండి" అని వాపోయాడు. నేను ఆతనికంటే కాస్త ఎత్తుకు ఎగిరి సూర్యతాపము నుండి ఆతనిని కాపాడాను. నా ఈ ప్రయత్నముచేత నా రెక్కలు బూడిదైపోగా, నేను ఈ కొండపై పడిపోయాను. ఈ విషయం తెలియని జటాయువు తిరుగు పయనమై వెడలి తన స్వస్థలమునకు వెళ్ళిపోయాడు.

రెక్కలు పోగొట్టుకుని బాధ పడుచున్న నాపై సూర్యుడు తన కరుణను చూపి, "సంపాతీ! బాధ పడవద్దు. ఏదో ఒక దినమున అయోధ్యరాముని భార్య సీతను వెదకుచూ వానరసేన ఈ తీరమునకు వచ్చును. వారికి నీవుసహకరించినట్లైతే నీవు నీ రెక్కలను మరల పొందగలవు" అని అభయమిచ్చాడు. ఆ ప్రకారము రామకార్య నిమిత్తమై మీ రాక కొరకు నేను ఇంతవరకు ఇచ్చోట నిరీక్షిస్తూ కాలం వెళ్ళబుచ్చాను. మీ యొక్క ఆగమనం చేత నాకు ఆ భాగ్యము లభ్యమైంది. నేను కూడ లబ్ధిపొందాను. వానరులారా! మీరందరూ ఇచ్చట నుండి నూరు యోజనముల దూరమందున్న లంకా నగరమునకు చేరుకొన మిక్కిలి కష్టతరము. మీలో బలవంతుడైన వానినొకరిని ఎంచుకొని సీత ఉన్న చోటును చూసి రమ్మని పంపండి" అని చెప్పి సంపాతి తన మార్గమున ఎగురుకొనుచు వెళ్ళిపోయింది.

పిదప జాంబవంతుని నాయకత్వంలో వారంతా చర్చించారు. అందరూ ఆతనితో సముద్రమును దాటి వెళ్ళడానికి తమ తమ శక్తులను తెలియజేశారు. గొప్పగొప్ప వీరులందరూ యాభై, అరవై యోజనముల వరకు మాత్రమే తాము దాటి వెళ్ళగలమని తెలిపారు. జాంబవంతుడు తాను తొంభై యోజనముల వరకు మాత్రమే వెళ్ళగలనని అంతకు మించి వెళ్ళడానికి తనకు శక్తి సరిపోదని తెలిపాడు. కాని మరల తిరిగి నూరు యోజనములు రావడం కుదరదని కూడా తెలిపాడు జాంబవంతుడు. అంగదుడు తాను నూరు యోజనములు దాటి లంకా నగరము వరకు

వెళ్ళగలనని కాని తిరిగి అదే నూరు యోజనముల తిరుగు పయనం తనకు వీలుకాదని తెలిపాడు.

"కావున ఇట్టి పరిస్థితిలో ఈకార్యమును ఒక్క ఆంజనేయుడు మాత్రమే నెరవేర్చగలడ"ని జాంబవంతుడు నిశ్చయించాడు. అందరూ ఆ హనుమంతుడే తగిన వాడని వత్తాసు పలికారు. కాని హనుమంతుడు మాత్రం "మీరందరూ నా బలమును తాహతుకు మించినదిగ తలచుచున్నారు. నాకు కూడా నా వలన ఇది సాధ్యమా! అను భయం కలదు. మన నాయకుడు రాముడొక్కడే దీనికి తగిన పరిష్కార మార్గమును జూపగలడు" అనిబదులిచ్చి ఒక్క క్షణం ప్రశాంతంగా వుండిపోయాడు. ఆ సమయమున జాంబవంతుడికి చిన్న వయసులో హనుమంతునికి కొందరు మునులు ఇచ్చిన శాపము జ్ఞప్తికి వచ్చింది.

"బ్రహ్మ మరియు అన్య దేవతలు ఇచ్చిన వరములచేత గొప్ప పరాక్రమమును పొందిన హనుమంతుడు ఒక దినమున మునులు విశ్రమించు ఆశ్రమమునకు వెడలి, వారి గదులలో ఉన్న పాలు, పెరుగు, నెయ్యి, ఫలములు, సమిధులు మున్నగు వానిని హోమగుండములో పోసి, కాలి పాడగునట్లుచేశాడు. ఆతని చేష్టలకు ఆగ్రహించిన మునులు ఆతనిని దండింప వీలుకాదని గ్రహించి, ఈతడు ఎన్నటికీ తన బలమును గుర్తించలేడు" అని శపించి వేసారు. హనుమంతుడు వారిని మన్నింపు కోరిన పిదప వారు, "శాపమును తిరిగి తీసుకొనుట కఠినం. కావున ఇతరులు నీ బలమును కొనియాడినచో నీవు నీ బలమును గుర్తించ గలవు" అని శాపవిమోచన మార్గమును తెలిపారు.


ఇది జ్ఞప్తికి వచ్చిన వెంటనే జాంబవంతుడు హనుమంతుని బలపరాక్రమమును తగిన రీతిన కొనియాడనారంబించాడు. హనుమంతుడు కూడా తన పరాక్రమమును గ్రహించి ఈ విధముగా ప్రమాణం చేశాడు. "లంకానగరమును భూమినుండి పెకళించి యైననూ సీతను తిరిగి తీసుకొని వచ్చెదను. కావున మీరెవరూ బాధపడవలదు. ఇతి త్వరితగతిన చేసి మీకు సీతను చూపుతాను."

'సుందరుడు' అను పేరును కూడా పొందిన హనుమంతుడు పెద్ద రూపమును దాల్చి ఈ అసాధ్యమైన కార్యమును సాధించ, రామ నామమును జపించుకొనుచూ మహేంద్రగిరినుండి లంకా నగరము వైపుకు ఎగుర నారంభించాడు.

- సశేషం

# ప్రహేళిక

ఈ క్రింది చిత్రాలలో పది తేడాలను గుర్తించండి



## శ్రీకృష్ణాష్టమి కార్యక్రములు (శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో)

15-8-25 శుక్రవారం- ఉ.8.01 గం.లకు బృందావన ప్రదక్షిణ, అనంతరం కలశస్థాపన, శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఉ.10.00 గం.లకు శ్రీ కాళీకా పరమేశ్వరీ అమ్మ వారికి లక్ష కుంకుమార్చన. మధ్యాహ్నం 12 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన. సాయంత్రం 5.30 గం.లకు లఘు ప్రార్థన, శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం.

16-8-25 శనివారం- ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. 10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం, భక్తసమారాధన. సా॥ 5.30 గం.లకు లఘుప్రార్థన, శ్రీ సద్గురు పాదపూజ.

17-8-25 ఆదివారం - ఉ. 6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. 11గం.లకు శ్రీరాధకృష్ణుల సామూహిక పూజలు, అనంతరం భక్తసమారాధన. శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం,

18-8-25 సోమవారం-శ్రీగురుదశమి- ఉ. 6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఉ.10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

19-8-25 మంగళ. - ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఏకాహం సంకీర్తన ప్రారంభం. ఉ.10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజ దాసు గారి ప్రవచనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

20-8-25 బుధ - ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్ర నామార్చన, దీక్షావిరమణ, ఏకాహం హారతి.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**ఆగస్ట్ 2025**

8 శని : శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

18 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

27 బుధ: వినాయకచవితి - శ్రీ సద్గురు పాదపూజ.

**సెప్టెంబర్ 2025**

7 ఆది: భాద్రపద పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

16 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - శ్రీ సద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**యదంఘ్రి కమలద్వంద్వం ద్వంద్వ తాప నివారకమ్**
**తారకం భవసింధోశ్చ తంగురుం ప్రణమామ్యహం.** 27

**<u>పదవిభాగము</u>** :-

యత్–అంఘ్రికమల–ద్వంద్వం–ద్వంద్వతాప–నివారకమ్– తారకం–భవసింధోః–చ–తం–గురుం–ప్రణమామి–అహం.

**<u>టీక</u>** :- యత్ = ఏ గురుదేవుని; అంఘ్రికమల = పాదపద్మ; ద్వంద్వం = యుగళము; ద్వంద్వ = శీతోష్ణ, సుఖదుఃఖాది; జంటవైన; తాప = వేదనలను, తాపమును; నివారకం = నివారించునో; భవసింధోః = జననమరణములను సంసార సముద్రమును తారకం; చ = తరింపజేయునో; తం = అట్టి; గురుం = గురుదేవునకు; అహం = నేను ప్రణమామి = నమస్కరిస్తున్నాను.

**<u>వ్యాఖ్య</u>** :- "ఏ గురుదేవుని పాదపద్మ యుగళము ద్వంద్వ తాపనివారకమో, భవ సింధు తారకమో, ఆ గురు దేవునికి నమస్కరిస్తున్నాను" అంటున్నాడు పరమశివుడు. గురుదేవుని పాదపద్మములు రెండు. రెండైన అవి జంటలైన శీతోష్ణ సుఖదుఃఖాదుల వలన తాపాన్ని హరిస్తాయట. ఇది ఎలా సాధ్యం? కనిపించటానికి గురు పాదములు రెండేగాని అవి చేసే పని ఒక్కటే. నాసా రంధ్రాలు రెండైనా, పీల్చే శ్వాస ఒక్కటే. పెదవులు రెండైనా, ఉచ్చరించే శబ్దం ఒక్కటే, ద్వైతంగా కన్పిస్తున్నా దాని వెనుక ఉన్న అద్వైతాన్ని స్ఫురింప జేస్తున్నదీ రూపకాలంకారం. అంతే కాదు – సుతిమెత్తనైనవి కమలములు. కొద్ది తాపానికే అవి వాడిపోతాయి.కాని గురుపాదపద్మాల విషయంలో తాపానికి అవి వాడి పోవటం కాదు; వాటి చల్లదనానికి తాపాలు నశిస్తాయి. ఇది చిత్రమైన విరోధాభాసం. అంతే కాదు – అంత సుతిమెత్తని పాదపద్మాలు భయంకరమైన భవసింధువును తరింపజెయ్యటం కూడా చాలా ఆశ్చర్యకరమే. శ్రీ గురు పాదపద్మాల సౌకుమార్యాన్నీ శక్తినీ చక్కగా వ్యక్తం చేస్తున్నదీ శ్లోకం. "మీకు

అంతా నమస్కరిస్తుంటే, మీరు ఎవరికి నమస్కరిస్తున్నారు?" అని వినమ్ర వదనయై అడిగిన ప్రశ్నకు యిలా సమాధానించాడు పరమేశ్వరుడు.

**దేహీబ్రహ్మ భవేద్యస్మాత్ త్వ త్కృపార్థం వదామితత్**
**సర్వ పాప విశుద్ధాత్మా శ్రీగురోః పాదసేవనాత్ 28**

**<u>పదవిభాగము</u>** :-

దేహీ-బ్రహ్మ-భవేత్-యస్మాత్-త్వత్-కృపార్థం-వదామి-తత్-
సర్వపాప విశుద్ధాత్మా-శ్రీగురోః-పాదసేవనాత్.

**<u>టీక</u>** :- దేహీ = జీవుడు; సర్వపాప = అన్ని పాపముల నుండి; విశుద్ధాత్మా = పరిశుద్ధమైన మనస్సుగలవాడై; శ్రీగురోః = శ్రీగురుదేవుని; పాద = పదసంబంధమైన లేక పాదములయొక్క; సేవనాత్ = సేవవలన; యస్మాత్ = ఏవిధముగా; బ్రహ్మ = బ్రహ్మముగా; భవేత్ = అవుతాడో; త్వత్ = నీ యందుగల; కృపార్థం = దయవలన; తత్ = ఆ రహస్యమును, వదామి = చెబుతున్నాను.

**<u>వ్యాఖ్యా</u>** :- "జీవుడు అన్ని పాపాలు తొలగి, విశుద్ధ చిత్తుడై, శ్రీ గురుదేవుని పాద సేవవలన ఎలా బ్రహ్మణ్యుడౌతాడో, ఆ రహస్యాన్ని నీ యందు దయతో చెబుతున్నాను" అన్నాడు స్వామి. అమ్మవారు లోకోపకారార్థం స్వామివారిని మూడు ప్రశ్నలు అడిగింది. 1) మీ నమస్కారం ఎవరికి? 2) గురు మహత్యం ఎటువంటిది? 3) దేహి ఎలా బ్రహ్మమయుడౌతాడు? పై శ్లోకంలో మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పబడింది. రెండవ, మూడవ ప్రశ్నలకు సమాధానం యీ శ్లోకం నుండి యివ్వబడుతున్నది. ముందు మూడవ ప్రశ్నకు సమాధానం చెప్పటం మొదలుపెట్టినట్లున్నా, "శ్రీగురోః పాదసేవనాత్" అనటం వల్ల రెండవ ప్రశ్నకు సమాధానం చెప్పకనే చెప్పినట్లయినది. "శ్రీగురుదేవుల పాదసేవనం వలన జీవుడు బ్రహ్మమయుడౌతాడు" అనటంలో గురుమహాత్మ్యం ఎటువంటిదో క్లుప్తంగా చెబుతూ, దేహి ఎలా బ్రహ్మమయుడౌతాడో ఆ రహస్యాన్ని కూడ క్లుప్తంగా చెప్పి, యిక దానిని విశదంగా వివరిస్తారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## అప్పన వారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ప్రతి వస్తువులోను దైవాంశ ఉంటుంది. అది లేని వస్తువుండదు. సృష్టిలో అణువణువునా వ్యాపించి ఉన్న పరమాత్ముడు, ప్రతి వస్తువులోను ఆ దైవాంశ రూపంలో యిమిడి ఉంటాడు. అందువలన పరమాత్మ తత్త్వమును అనుభవంలో పొందిన మహాత్ములు ఏ వస్తువులోని దైవాంశ నైనా అలా ఆవిష్కరించి చూపగలరు.



తేగలు స్వామికి చాలా యిష్టము. శ్రీ బాబు చక్కగా కాలిన తేగలు తెప్పించి, పై పీచు తొలగించి, గుండ్రని ముక్కలుగా కోసి, ఒక పళ్ళెంలో వేసి, పేరిన నెయ్యి ఆ ముక్కలపై వేసి, కొద్దిగా ఉప్పూ కారమూ చల్లించేవారు. ఒక ముక్క తాము నివేదన చేసుకొని, మిగతావి అందరికీ యిచ్చేవారు. "ఏమయ్యా! నారాయణా? ఎలా ఉంది?" అని అడిగేవారు.

నారా – చాలా బాగుంది బాబూ!

శ్రీ బాబు – మొత్తమంతా తినేశావా, ఏమైనా వదిలేశావా?

నారా – పీచు మాత్రం మిగిలింది బాబూ, అది పారేశాను.

శ్రీ బాబు – ఎందుకని?

నారా – అందులో రుచి లేదు బాబూ! వట్టి చెత్త.

శ్రీ బాబు – చూశారా! సంసారంలో కూడా, మానవుడికి కలిగే కొద్దిపాటి సుఖంతో బాటు, చెత్తవంటి అనేక నీచభావాలు, దుష్టసంకల్పాలు, రాగద్వేషాలు, యీర్ష్యాసూయలు పెనవేసుకొనిపోయి ఉంటాయి. అందులో సారమైన వస్తువును మాత్రం గ్రహించి, నిస్సారమైన చెత్తను వదిలివేయాలి. సంసారంలో సారమైన వస్తువు ఏది? దారాపుత్రాదులను, ధన ధాన్యములను నీకు ప్రసాదించి, వాటితో బాటు ఏది నిజమైన శాంతిని, నిత్యమైన ఆనందాన్ని యివ్వగలదో తెలుసుకోవటానికి కావలసిన వివేకమును కూడా ప్రసాదించిన భగవానుడే అన్నిటిలోను సారభూతమైన వస్తువు. ఆయన మాత్రమే నిత్యమైన, సత్యమైన సుఖశాంతులను నీకు ప్రసాదించగలడు. ఆయనను ఆశ్రయించాలి. సారహీనమైన చెత్తను వదిలి పెట్టాలి" అని చెప్పారు.అలాగే "బంగారు తీగెలు" చెరకు ముక్కలను కోయించి అందిస్తూ అదే తత్త్వాన్ని , పామరులకు

కూడా హత్తుకునే విధంగా బోధించేవారు. తమదే అయిన యీ జగత్తులో, తమ బిడ్డలే అయిన యీ మానవకోటి యెడల ఆ జగత్పితకు, ఆ జగన్మాతకు గల అపార ప్రేమ, అవ్యాజ కరుణ, ఏ కొలతలకు అందుతాయి? అవి అనుభవైకవేద్యములే గాని మాటలకు అందనివి. అక్షరమే తానైన ఆత్మ వస్తువును ఏ అక్షరములలో వర్ణించగలము?

శ్రీ బాబు సన్నిధిలో నిలబడి, కరుణామృతమును కురిపించే ఆ స్వామి మధురమైన, మహిమాన్వితమైన దృష్టిలో పడిన గడ్డిపరక నుండి, కమలభవుడైన బ్రహ్మాదేవుని వరకు సర్వము ధన్యమే. ఆ మహాత్ముని దృష్టి అమోఘ దృష్టి. అది మహా జ్ఞానులను కూడా మహామాయలో ముంచెత్తనూ గలదు; అనన్య విశ్వాసంతో ఆశ్రయించిన పరమ పామరులనైనా, ఆ మహామాయ బారిని పడకుండా రక్షించనూ గలదు. అందుకే మహామాయను "**మమ మాయా**" – "అది నా స్వంతం" అని అలనాడు శ్రీ కృష్ణ భగవానుడు అర్జునునితో అన్నాడు.

తన తమ్ముడైన రాజేశ్వరరావుకు తండ్రిగారు 9 ఎకరాల ఆస్తిని కేటాయించినా, తండ్రిగారి అనంతరం కుటుంబం నిర్వహిస్తున్న అన్నగారు ఆ పొలం తమ్ముడికి యివ్వకుండా దాటవేస్తున్నారు. తీరా శ్రీ బాబు ఎదుటకు వచ్చేసరికి, వారి కరుణామయ దృష్టికి కరిగి నీరై "మా తమ్ముడి 9 ఎకరాల భూమి అతనికి తమ సన్నిధిలోనే యిచ్చేస్తున్నాను" అని అన్నగారు అక్కడే స్వామి సమక్షంలోనే తమ్ముని భూమిని అతని పేర వ్రాయించి యిచ్చారు. మహాత్ముల దృష్టి అంత మహిమాన్వితమైనది.

ముంజవరపుకొట్టులో అయిలూరి కామేశ్వరరావు గారు గొప్ప తర్కశాస్త్ర పండితులు. వారిని గురుక్కుళ్ళు అనేవారు. వారు తరచుగా శ్రీ బాబు దర్శనానికి వచ్చేవారు. తత్త్వ విచారణ జరుపుతూ ఉండేవారు. గంటల తరబడి శ్రీ బాబుతో మాట్లాడిన ప్రభావం చేత, 'తర్కం దాటితే గాని తత్త్వం అందుకోలే'మని వారు గ్రహించ గలిగారు. అప్పన రామారావుగారి బావమరిది కూనల సీతారామయ్యగారు రాజమండ్రిలో ఉండేవారు. శ్రీ బాబు దర్శనమైన నాటి నుండి వారు శ్రీ బాబు చరణ సేవ చేసుకుంటూ, శ్రీ బాబు ఎక్కడికి వెళ్ళినా వారితో బాటు వెళ్ళి దాస్య భావంతో సేవించుకునే వారు. ఆశ్రమ స్థాపనానంతరం సీతయ్య దంపతులు శ్రీ బాబు చరణార విందములను ఆశ్రయించుకుని ఆశ్రమంలోనే ఉండి తమ శేష జీవితములను సార్థకం చేసుకున్నారు. సీతయ్యగారి బావమరిది రాంపండు తన వివాహమయ్యే వరకు శ్రీ బాబు వద్దనే అత్యంత ఆంతరంగిక భక్తుడై 'అమ్మ' పూజ సమయంలో కూడా ప్రక్కనే ఉండి శ్రీ బాబుకు సేవ చేసుకున్నాడు.

మంజవరపుకొట్టు పేరు వినగానే మహాశివరాత్రి పండుగ జ్ఞాపకం వస్తుంది. అప్పన సత్యనారాయణ మూర్తిగారు, వారి ధర్మపత్ని భూషణమ్మగారు శ్రీ బాబు భక్తులు. శ్రీ బాబు ఎప్పుడు ముంజవరపుకొట్టు వచ్చినా, వారి యింట్లోనే తమ పూజా పీఠంతో సహా ఉండేవారు. ఆ దంపతులకు మగ సంతానం లేదు. వారు శ్రీ బాబును దైవభావంతో మాత్రమే గాక, తమ ప్రియ పుత్రునిగా కూడా భావించుకునే వారు. శ్రీ బాబు భూషణమ్మగారిని 'అమ్మా!' అని పిలిచేవారు. సత్యనారాయణ మూర్తిగారి ఆఖరి గడియలలో శ్రీ బాబు వారి నోటిలో తులసి తీర్థం పోసి వారికి గురుసాయుజ్యం కలిగించారు. 1965 నుంచి భూషణమ్మగారు ప్రతి సంవత్సరం శ్రీ బాబును భక్తులందరితో ఆహ్వానించుకుని మహాశివరాత్రి పర్వమును మహోత్సవంగా ముంజవరపుకొట్టులో జరుపుకునే వారు.

- సశేషం

## పది తేడాలు

1. శ్రీకృష్ణుడి నడుము వద్ద ముడి దిశ మారింది.
2. కృష్ణుడి మాలలో ముత్యాల సంఖ్య భిన్నంగా ఉంది.
3. కృష్ణుడి చెవి రింగు ఒకటి లేదు.
4. గణేశుడి కిరీటం డిజైన్ వేరుగా ఉంది.
5. గణేశుడి గొలుసులు వేరుగా ఉన్నాయి.
6. గణేశుడి చేతి గాజు లేదు.
7. కృష్ణుడి నడుము వస్త్రంలో డిజైన్ మారింది.
8. గణేశుడి ధోవతి అంచు వేరుగా ఉంది.
9. కృష్ణుడి నెమలిపింఛంలో తేడా ఉంది.
10. గణేశుడి కుడి చేయి వేళ్ళు భిన్నంగా ఉన్నాయి.

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు -రమణ ప్రసాద్

# భక్త రామదాసు

ఆ తరువాత శ్రీరామచంద్రుని గుర్తింపలేక పోయిన తన అజ్ఞానానికి చింతించి, తానీషాకు రామ దర్శనమైనందుకు అతనిని పొగిడాడు. రామదాసు మహాభక్తుడని గ్రహించి చెరనుండి విడిపించి దైవదత్తమైన ఆరు లక్షల పైకాన్ని అతనికే తిరిగి బహుమానంగా సమర్పించి పట్టువస్త్రాలతో సత్కరించి సాదరంగా సాగనంపాడు తానీషా. దారిలో దొంగలు అడ్డగిస్తే ఎలుగెత్తి రాముని పిలువగానే రాకుమారుల రూపంలో ధనుర్బాణాలు ధరించి వచ్చి దొంగలను తరిమివేశారు.



శ్రీ హరి భక్తులతో భద్రగిరి చేరుకుని రామదాసు భద్రాద్రివాసుని సేవించి పరమానంద భరితుడైనాడు. నిత్యమూ స్వామిని పూజించి సేవించి చరితార్థుడైనాడు. రామదాసు పూజలనందుకుంటున్న సీతమ్మకు ఒక సందేహం వచ్చింది. ఆమె రామునివైపు తిరిగి “ఎంత చిత్రం! మీ అంతరంగ భక్తుడైన రామదాసుకు దర్శనం ఇవ్వకుండా తానీషా నవాబుకు దర్శనం ఇవ్వటానికి కారణం ఏమిటి?” అని అడిగింది.

“గంగానదిలో స్నానంచేసి ఉత్తరాన ఉన్న శివుని పూజించిన వారికి ఇంద్ర పదవి లభిస్తుందనే వాడుక ఉంది. ఒక బ్రాహ్మణుడు ఆ పదవి కోసం ప్రయత్నం చేశాడు. ఫలితం లభించలేదు. ఇంద్రపదవి లభించలేదనే నిరాశతో తన చేతిలో వున్న నీటి కుండను కోపంతో శివుని శిరస్సున విసిరి కొట్టాడు. పశుపతి అతని భక్తికి మెచ్చినా వాని దుష్కార్యానికి మ్లేచ్ఛునిగా పుట్టమని శాపం ఇచ్చాడు. శాపానికి గురి అయిన బ్రాహ్మణుడు అమిత వేదనతో ప్రార్థించగా శివుడు “నీకు ఆ జన్మలో భగవద్దర్శనం లభించి జ్ఞానవంతుడవు అవుతావు” అని వరం ప్రసాదించాడు.

అందుకే నేను దర్శనమిచ్చాను అని చెప్పాడు. సీత ఇంకొక సందేహం వెలిబుచ్చింది. "మరి రామదాసుకు దర్శనం ఈయని కారణం ఏమిటో సెలవివ్వండి" అంది.

"రామదాసు పూర్వజన్మలో శివభక్తుడు అయినా దుశ్చరితుడై వుండేవాడు. రామచిలుకను పంజరంలో బంధించి దానికి రామనామాన్ని నేర్పాడు. ఆ రామ నామాన్ని వింటూ ఉన్నందున రామదాసై జన్మించాడు. చిలుకను బందీ చేసిన ఫలితంగా చెరలో బందీ అయ్యాడు. కర్మ మిగిలితే మళ్ళీ జన్మ ఎత్తవలసి వస్తుందని ఈ జన్మలోనే కర్మ నిశ్శేషంగా చెరలో అనుభవించేటట్లు చేశాను. ఇక దర్శన మంటావా దానికి తగిన సమయం ఆసన్నమవుతుంది" అని చెప్పాడు రాముడు.

రామదాసు భద్రాచలేశ్వరునికి వైభవోపేతంగా నిత్యోత్సవాలు, భక్త కైంకర్యం, చేస్తూ శేష జీవితాన్ని గడిపాడు. అతని కర్మ నివృత్తి అయిన అనంతరం శ్రీ రామచంద్రుడు అతనికోసం పుష్పకవిమానం పంపాడు. కలలో దర్శనమిచ్చి మాట ఇచ్చిన ప్రకారం తన ఇంటి ముంగిట వాలిన పుష్పక మివానాన్ని చూసి బ్రహ్మానంద భరితుడై. తాను భార్యను తొందర పెడుతూ తనతో రమ్మని పిలిచాడు. ఆమె కర్మ బద్ధురాలై, ఇహానికి బద్ధురాలై వెంటనే రాలేకపోయింది.

"తరలిపోతాము దయ యుంచండికను
మళ్ళీ జన్మలకు రాము మదిలోనుంచండి"

అని పలుకుతూ భగవత్సాయుజ్యాన్ని పొందాడు రామదాసు. అతని భార్య కమల పశ్చాతాపంతో మొర పెట్టుకుంటే శ్రీరాముడు, కుమారునికి తనని సేవించే వయస్సు వచ్చే వరకు తనకు కైంకర్యము చేస్తూ ఉండమని ఆదేశించగా ఆమె అలాగే సేవించి చివరికి పరంధామునిలో లీనమయ్యింది.

దాశరథిని కొలచిన వారి పాపాలు నశిస్తాయి. మోక్షలక్ష్మి లభిస్తుంది. అఖండ వైభవాలు కలుగుతాయి. అని తను నమ్మిన సత్యాన్ని తాను నిరూపించి చూపిన పరమ భక్తాగ్రేసరుడు శ్రీ రామదాసు.

Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003,N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## జూన్ 17 నుండి 22 వరకు న్యూజెర్సీ, అమెరికాలో శ్రీ మాతాజీ పర్యటన దృశ్యాలు





ఎడిసన్, శ్రీ వారణాసి
కాళీ ప్రసాద్ గృహమునందు



పెన్సిల్వేనియా, శ్రీ శ్రవణ్‌కుమార్,
ప్రియభాషిణిల గృహమునందు



ఎడిసన్,
శ్రీ సాయిదత్త పీఠం నందు

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

జూన్ 17 నుండి 22 వరకు న్యూజెర్సీ, అమెరికాలో
శ్రీ మాతాజీ పర్యటన దృశ్యాలు



ఎడిసన్, న్యూజెర్సీలోని
శ్రీ సాయి దత్త పీఠము నందు
నిర్వహించిన సామూహిక
సద్గురుపాదపూజ దృశ్యాలు





If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.